

నేడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్


తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

నిజామాబాద్ సంపుటి : 25 సంచిక : 214 ఎడిటర్ : శివకుమార్ గౌడ్ ఆదివారం 09 - 08 - 2026 పేజీలు : 08 వెల రూ. 3




# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

- తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగకూడదు
- 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం
- పత్తిపాకతో 10 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు
- భూసేకరణ, టెండర్లు, అనుమతులు సమాంతరంగా చేపట్టాలి
- నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగవంతం చేయాలి
- ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే లక్ష్యం



**కబురు న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 08 :** సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. - మిగతా 2 లో



## తెలంగాణలో త్వరలో మద్యం ధరల పెంపు!

- ధరల సవరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కమిటీ
- మూడేళ్ల తర్వాత ధరల పెంపునకు సిద్ధమైన సర్కార్
- 10 నుంచి 15 శాతం పెంపు కోరుతున్న మద్యం తయారీ సంస్థలు
- పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాపై ప్రభుత్వం ఆందోళన

**కబురు న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 08 :** మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. బడ్జెట్, మిడ్-రేంజ్, ప్రీమియం సహా అన్ని రకాల - మిగతా 2 లో



## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
- నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
- 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

**కబురు న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 08 :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో - మిగతా 2 లో

## సవాళ్లే అవకాశాలుగా మారుతాయి నేర్చుకునే వాడు గెలుస్తాడు



- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిష్టాత్మక పురస్కారాల ప్రదానం
- 'వికసిత్ భారత్' సాకారంలో యువతదే కీలక పాత్ర అని వ్యాఖ్య

**కబురు న్యూస్, ఢిల్లీ, ఆగస్టు 08 :** ప్రపంచం, సాంకేతికత వేగంగా మారుతున్నాయని, ఎవరైతే నిరంతరం నేర్చుకుంటారో వారే విజయం సాధిస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. యువత నిత్య విద్యార్థుల్లాగా ఉంటూ, ఏదో ఒకటి తెలుసుకోవాలనే ఉత్సుకతను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం ఉన్నవారికి, అవే అవకాశాలుగా మారుతాయని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తోందని, యువత కోసం కొత్త రంగాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. ఢిల్లీ ఐఐటీ 57వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఐఐటీ ఢిల్లీలో ప్రారంభించిన కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమాలకు మోదీ శుభాకాంక్షలు - మిగతా 2 లో

## వేలమంది భారతీయులను వెనక్కి పంపిన కెనడా !

- ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 3,323 మంది భారతీయులను బహిష్కరించిన కెనడా
- బహిష్కరణ జాబితాలో మెక్సికన్లను దాటి అగ్రస్థానానికి చేరిన భారతీయులు
- మరో 7,669 మంది ఇండియన్స్ బహిష్కరణ జాబితాలో ఉన్నారని అధికారిక డేటా వెల్లడి

**కబురు న్యూస్, ఢిల్లీ, ఆగస్టు 08 :** కెనడాలో నివసిస్తున్న భారతీయులకు ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే కెనడా ప్రభుత్వం ఏకంగా 3,323 మంది భారత పౌరులను దేశం నుంచి బహిష్కరించింది. ఈ సంఖ్య గత ఆరేళ్ల రికార్డులను మించిపోయేలా ఉండటం గమనార్హం. కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ



Image Credit: Pixel-Shot Shutterstock.com

## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్

- అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు
- అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు ఖరారు
- సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో పేర్లను చేర్చిన కేంద్ర ప్రభుత్వం
- చైనా పేరు మార్పు యత్నాలకు గట్టి జవాబుగా ఈ నిర్ణయం
- జాబితాలో వ్యూహాత్మక సరిహద్దు గ్రామాలు, పర్వత కనుమలు
- ప్రాదేశిక సమగ్రతను చాటుకున్న భారత్



**కబురు న్యూస్, ఢిల్లీ, ఆగస్టు 08 :** అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా దూకుడుకు కళ్లెం వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 27 వ్యూహాత్మక ప్రాంతాలకు అధికారికంగా పేర్లను ఖరారు చేసింది. ఈ పేర్లను సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చేర్చనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. - మిగతా 2 లో

## భారతీయులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే - ఫోన్‌పే సీఈఓ




- యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు పడతాయన్న వార్తల వేళ ఫోన్‌పే కీలక ప్రకటన
- ఎక్స్ వేదికగా ప్రకటించిన ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్
- యూపీఐ సేవలు ఉచితంగా కొనసాగుతాయని స్పష్టం

**కబురు న్యూస్, ఢిల్లీ, ఆగస్టు 08 :** యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు పడతాయంటూ జరుగుతున్న చర్చకు ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ - మిగతా 2 లో



## శ్రీశైలానికి పోటెత్తిన వరద

- నిండుకుండలా మారుతున్న జలాశయం
- కృష్ణానది నుంచి శ్రీశైలానికి భారీగా వరద నీరు
- 875 అడుగులకు చేరువలో జలాశయం నీటిమట్టం
- ప్రస్తుత నీటి నిల్వ 162 టీఎంసీలు, పూర్తి సామర్థ్యానికి 10అడుగుల దూరం
- రెండు రాష్ట్రాల పవర్‌హౌస్‌లలో మొదలైన విద్యుదుత్పత్తి
- నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

**కబురు న్యూస్, శ్రీశైలం, ఆగస్టు 08 :** కృష్ణా నది ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి - మిగతా 2 లో

## ఏపీపై ఎల్‌నినో పంజా కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



- ఏపీలో ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందని షర్మిల ఆందోళన
- ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శ
- రాష్ట్రంలో 69 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, 50 లక్షల ఎకరాలు ప్రభావితమయ్యాయని వెల్లడి
- రైతులకు నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్ సహా పలు డిమాండ్లు

**కబురు న్యూస్, అమరావతి, ఆగస్టు 08 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఆమె - మిగతా 2 లో

## చేసిన మంచిని చెప్పకపోతే తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
- గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు
- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
- డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి



**కబురు న్యూస్, అమరావతి, ఆగస్టు 08 :** ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము - మిగతా 2 లో

తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం 09 - 08- 2026

# సంపాదకీయం

## ‘డిజిటల్’ భారం సరికాదు!



ప్రారంభమై పదేళ్లు గడిచాక యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సాగే డిజిటల్ లావాదేవీలకు వడ్డింపు మొదలుకాబోతోంది. లోక్‌సభలో గురువారం గందర గోళం నెలకొన్నప్పుడు, ఎలాంటి చర్చా లేకుండా ఇందుకు సంబంధించిన బిల్లుఆమోదం పొందిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. తక్షణమే వర్తించకపోయినా భవిష్యత్తులో ఎప్పుడైనా యూపీఐ లావాదేవీలపై రుసుము వసూలు చేసేందుకు ఈ బిల్లు అధికారమిస్తోంది. ఫీజంటూ వసూలు చేస్తే రూ. 2,000కు మించిన లావాదేవీలపై, అది కూడా వార్షిక టర్నోవర్ కోటిన్నర మించే వ్యాపారులకే వర్తిస్తుందని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. విధించబోయే ఫీజు కూడా ఒక్కో లావాదేవీకి 0.25 శాతం లేదా 0.5 శాతం ఉండొచ్చన్నది మరో మాట. సాధారణ యూపీఐ వినియోగదారులు సాగించే లావాదేవీలన్నీ ఎప్పటిలా యధాతథంగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీన్ని విశ్వసించలేం. ఆదాయం పెంచుకునేందుకు అవకాశం ఉన్నప్పుడు ఆ చట్టానికి ముందూ మునుపూ సవరణలు రాబోవని చెప్పలేం. ఆ సంగతలావుంచి తమపై రుద్దే ఈ చార్జీల్ని వ్యాపారులు వినియోగదారుకే బదిలీ చేస్తారు. ఆ అవకాశం లేకుండా తగిన నియంత్రణలు విధిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వగలదా?దేశంలో ఆర్థిక సంస్కరణల ఆగమనంతోపాటే పాలకులు కొత్త రాగం అందు కున్నారు. ప్రభుత్వాలు పాలించాలి తప్ప వ్యాపారం చేయడమేమిటన్నదే దాని సారాంశం. ఆ వంకన లక్షలాదిమంది సిబ్బంది పనిచేసే దిగ్గజ పబ్లిక్ రంగ సంస్థలు అనేకం కనుమరుగయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు గర్వకారణంగా నిలిచి, ఆసియాలోనే అతిపెద్దదైన నిజాం షుగర్స్ కాస్తా ఆనాటి సీఎం చంద్రబాబు పుణ్యమా అని మూతబడింది. కోట్లాది రూపాయల విలువైన దాని ఆస్తుల్ని కారుచవగ్గా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. నిజాం షుగర్స్ మాదిరిగా మరెన్నో పబ్లిక్ రంగసంస్థలకు తాళాలుపడ్డాయి. వ్యాపారమంటే వదులుకున్నాయిగానీ... ప్రభుత్వాలకు వ్యాపార దృక్పథం పోలేదని యూపీఐ లావాదేవీలపై ఫీజు వసూలు ఆలోచన నిరూపిస్తోంది. యూపీఐ, రూపే వంటివి ఉచిత సేవలు అందించటంవల్ల తమవీసా, మాస్టర్‌కార్డ్ వగైరా ప్లాట్‌ఫాంలు ఎదగటంలేదన్న అమెరికా ఆక్రోశమే తాజా నిర్ణయానికి కారణమని కొందరి ఆరోపణ.బ్రెజిల్‌పై సైతం అమెరికా ఈ మాదిరి ఒత్తిడే తెచ్చినా అది అంగీకరించలేదని కూడా చెబుతున్నారు. వాటి నిజానిజాల సంగతలావుంచి, ప్రభుత్వం చెప్పే కారణాలు మాత్రం ఎప్పటినుంచో వింటున్నవే. యూపీఐ వ్యవస్థ నిర్వహణ తడిసిమోపెడు భారమవుతున్నదని బ్యాంకులూ, పేమెంట్ ప్రాసెసర్లూ గగ్గోలు పెడుతుండటంవల్ల ఇది తప్పడం లేదట! లావాదేవీల నిర్వహణ భారంలోకొంతమేర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. దాంతోపాటు ఈ లావాదేవీలు పెరిగాకబ్యాంకులు తమ సిబ్బందిని తగ్గించుకోలేదా? ఆమేరకు వాటి ఖర్చు తగ్గలేదా? అదీగాక గత దశాబ్దకాలంలో బ్యాంకింగ్ సేవల చార్జీలు, కనీస మొత్తం ఖాతాలో లేదన్న కారణంతో వసూలు చేసే పెనాల్టీ, పరిమితికి మించిన లావాదేవీలపై చార్జీలు, ఎస్ఎంఎస్‌సందేశాలకని, డెబిట్ కార్డు నిర్వహణ వ్యయమని బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ఇవన్నీ చాలకనా ఈ కొత్త ఆలోచనలు!ఈ పదేళ్లలో డిజిటల్ లావాదేవీలు అపారంగా పెరిగాయి. అయినా ఈ పెరుగుదల తగినంతగా లేదని ఆర్థిక నిపుణులంటున్నారు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే వగైరాలు వినియోగిస్తున్నవారు వాటిని బ్యాంకింగ్ సేవలుగా చూడటం లేదు... ఆ యాప్‌లను పర్స్‌గా పరిగణించి లావాదేవీలు జరుపుకొంటున్నారు. అలవాటు చేసినట్టే చేసి,దాన్నుంచి కూడా ఆదాయం పొందాలనుకోవటం సరికాదు. ప్రస్తుతం దేశంలో డిజిటల్ లావాదేవీల వినియోగదారుల సంఖ్య 50 కోట్లని చెబుతున్నారు.అయితే ఒక వినియోగదారు సగటున చేసే లావాదేవీలు చూస్తే ప్రపంచ స్థాయికన్నా తక్కువే. అలాగే లావాదేవీల్లో 86 శాతం రూ.500, అంతకన్నా తక్కువ మొత్తాలేనని అంటారు. మొదట్లో ఉన్నంత వృద్ధి ఇటీవలి సంవత్సరాల్లో కనబడటం లేదని కూడా అంటున్నారు. ఇదంతా ఏం చెబుతోంది? ఎంతో వెసులుబాటుగా, ఉపయోగకరంగా ఉన్న ఈ లావాదేవీలు మరింత విస్తరించాల్సిన తరుణంలో వాటిని నిరుత్సాహపరిచేలా, జనం మళ్లీ నగదు వైపు మొగ్గేలా చేయటం వింతకాదా? ప్రభుత్వం ఆలోచించాలి.

## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

**మొదటిపేజీ తరువాయి -** వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు” అని చంద్రబాబు వివరించారు.ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను



గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో ‘జీరో టాలరెన్స్’ పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు.గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఏపీపై ఎల్‌నినో పంజా.. కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్

**మొదటిపేజీ తరువాయి -** తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. “పాలనను గాలికొదిలేసి, కులమత కొట్లాటల్లో, కేసుల్లో, మోదీ పొగడ్త సభల్లో మీరు, మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజీగా ఉన్నారు. అటు వైసీపీ, ఇటు కూటమి రెండూ ఒకటే. వీరికి రాష్ట్రం, ప్రజల బాగోగులు పట్టవు” అని ఆమె వ్యాఖ్యానించారు.ఆరేడు నెలలుగా ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం కనీస కంటింజెన్సీ ప్రణాళికలు కూడా సిద్ధం చేయలేదని దుయ్యబట్టారు. జిల్లాల వారీగా సమీక్షలు, రైతులకు మార్గదర్శకాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం క్వాంటం, డేటా సెంటర్లంటూ కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నారని, మిమ్మల్ని నమ్ముకున్న లక్షలాది రైతుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయని మండిపడ్డారు.ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరఫున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.

**కాంగ్రెస్ పార్టీ డిమాండ్లు:**

1. ఎండిపోయిన పంటలకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలి.
2. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలి.
3. రిజర్వాయర్ల నుంచి చివరి ఆయకట్టు భూములకు కూడా నీరందేలా చూడాలి.
4. వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయాలి.
5. రైతులకు కొత్తగా వడ్డీ లేని రుణాలు అందించాలి.
6. ఎల్‌నినో నష్టాలను అంచనా వేసి ప్రతి రైతుకు ఉచితంగా పంటల బీమా వర్తింపజేయాలి.
7. పశుగ్రాసం కొరత తీర్చేందుకు పాడి రైతులకు ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వాలి.

తక్షణమే మేల్కొని మంత్రులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దింపి రైతులను ఆదుకోవాలని షర్మిల సూచించారు. “ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే రైతులు, ఇతర వర్గాల ప్రజలతో కలిసి మీ సర్కారు వెన్ను విరిచి మరీ నిలదీస్తారని మరవకండి” అని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సవాళ్లే అవకాశాలుగా మారుతాయి- నేర్చుకునే వాడు గెలుస్తాడు

**మొదటిపేజీ తరువాయి -** తెలిపారు. ఒకప్పుడు సెమీకండక్టర్ల రంగంలో భారత్ సత్తాను కొందరు శంకించారని, అయితే ఇప్పుడు తొలి సెమీకండక్టర్ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభమైందని గుర్తుచేశారు.“ఈరోజు ప్రపంచం అత్యంత వేగంగా మారుతున్న తరుణంలో మీరు ఈ ఇన్‌స్టిట్యూట్ నుంచి బయటకు అడుగుపెడుతున్నారు. నేడు ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాలు చాలా వేగంగా మారుతున్నాయి. గ్లోబల్ పవర్ బ్యాలెన్స్ కూడా అనుక్షణం మారుతోంది. దీని వెనుక ఉన్న అతిపెద్ద శక్తి టెక్నాలజీ వేగం. రానున్న 20 నుంచి 30 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందని ఈరోజు ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కానీ , మార్పుల పర్వం వచ్చినప్పుడల్లా సవాళ్లు కూడా వస్తుంటాయి. అలాగే కొత్త అవకాశాలు కూడా పుట్టుకొస్తాయి. ప్రపంచం మారుతుంది, టెక్నాలజీ మారుతుంది, పరిశ్రమలు మారుతాయి, వృత్తులు కూడా మారుతాయి. కానీ వీటన్నింటి మధ్య నా మాట ఒకటి గుర్తుంచుకోండి. ఎవరైతే నిత్య విద్యార్థిగా ఉంటారో వారే గెలుస్తారు. జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండి, వికసిత్ భారత్ కోసం విద్యార్థులు తమవంతు పాత్ర పోషించాలి. కొత్త సవాళ్లకు కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఎవరికైతే ఉంటుందో, ఆ సవాళ్లే వారికి అవకాశాలుగా మారుతాయి.‘వికసిత్ భారత్’ సాకారం చేయడంలో యువత తీసుకునే నిర్ణయాలే కీలక పాత్ర పోషిస్తాయని మోదీ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పురోగమి స్తున్నందున ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాలు, అధికార సమతుల్యత నిరంతరం మారుతున్నాయని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి ఆర్థిక, సాంకేతిక, పారిశ్రామిక స్వావలంబన అవసరమని పిలుపునిచ్చారు. ప్రతి తరానికి కొన్ని సవాళ్లు, జాతీయ బాధ్యతలు ఉంటాయని, విద్యార్థులు తమ జీవితంలో రానున్న 35 ఏళ్లలో తీసుకునే నిర్ణయాలు ‘వికసిత్ భారత్’ ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. యువ శక్తి తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎలా ఉపయోగపడుతుంది, దేశ అవసరాలను ఎలా తీరుస్తుందనే కోణంలో ఉండాలని సూచించారు.ప్రతి రంగంలో స్వావలంబన అనేది వికసిత్ భారత్ అభివృద్ధికి పునాది అని మోదీ పేర్కొన్నారు. దేశంలో ‘చిప్ నుంచి షిప్’ వరకు ప్రతిదీ మన యువత చేతుల మీదుగానే తయారవుతుందని ఆయన నొక్కి చెప్పారు. డ్రోన్ వంటి సాంకేతిక రంగాల్లో యువత కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. వాటి సహాయంతో వ్యవసాయం, మందుల సరఫరా, దేశ రక్షణ, భద్రతలో సహాయపడుతున్నాయని చెప్పారు. యువ శక్తి ఆవిష్కరణల కోసం ఏఐ, డేటా కేంద్రాలు ఎదురుచూస్తున్నాయని, భారత్ సరికొత్త పరిశోధనలు కోరుకుంటోందని అన్నారు. అలాగే, అకాడమిక్ మౌలిక సదుపాయాలు మరింతగా పెంచామని, పరిశోధనల రంగానికి రూ.లక్ష కోట్ల నిధులు కేటాయించామని స్పష్టం చేశారు. కాగా, ఈ స్నాతకోత్సవంలో 587 మంది గ్రాంట్స్ కాలర్లతో సహా మొత్తం 3వేల మందికి పైగా విద్యార్థులు తమ



పట్టాలను అందుకున్నారు. విద్యార్థులకు రాష్ట్రపతి స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకం, శంకర్‌దయాళ్ శర్మ స్వర్ణ పతకం, పర్‌ఫెక్ట్ టెన్ స్వర్ణ పతకాలను మోదీ బహుకరించారు.ఇదిలా ఉండగా, స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రమైన ‘పరం ప్రజ్ఞ’ను మోదీ ప్రారంభించారు. ఇది కృత్రిమ మేధ(ఏఐ) సామర్థ్యాలతో పనిచేసే అత్యంత ఆధునిక హై-పర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ. ఇది డేటా సైన్స్, అధునాతన కంప్యూటింగ్, అంతర్విభాగ పరిశోధన రంగాల్లో సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుందని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది.

## శ్రీశైలానికి పోటెత్తిన వరద

**మొదటిపేజీ తరువాయి -** చేరుతుండటంతో శ్రీశైలం జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయానికి జూరాల ప్రాజెక్టు నుంచి 2,57,059 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా, శ్రీశైలం జలాశయానికి 2,11,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం అది 874.70 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయిలో నిండటానికి మరో 10 అడుగుల మేర నీరు చేరాల్సి ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 162.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రెండు, మూడు రోజుల్లో నీటి నిల్వ 200 టీఎంసీలను దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు.భారీగా వరద నీరు వస్తుండటంతో అధికారులు జలవిద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. తెలంగాణ పరిధిలోని ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో 21,189 క్యూసెక్కుల నీటిని వినియోగించి 7.319 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 9,603 క్యూసెక్కుల నీటితో 1.684 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. విద్యుదుత్పత్తి అనంతరం 30,792 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. వీటితో పాటు వెలిగోడుకు 4,000 క్యూసెక్కులు విడుదల చేయగా, శనివారం గోరకల్లు జలాశయానికి మరో 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.ఈ జాబితాలో అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని లాంగ్జూ, మాజా, బిసా వంటి కీలక సరిహద్దు గ్రామాలు ఉన్నాయి. వీటితో పాటు, జో లా, రిజా లా, పుకుర్ లా, థాగ్ లా అనే నాలుగు పర్వత కనుమలు, ఎత్తైన సంభో సరోవర్ సరస్సు, షేర్-ఎ-థాపా స్మారక చిహ్నం వంటి ప్రదేశాలు కూడా ఉన్నాయి. అంజావ్, చాంగ్‌లాంగ్, వెస్ట్ కామెంగ్, లోహిత్, తవాంగ్ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు కూడా పేర్లను స్థిరీకరించారు.అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా పదేపదే కొత్త పేర్లు పెడుతూ వివాదం సృష్టిస్తున్న నేపథ్యంలో, భారత్ ఈ చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతాలపై స్పష్టత ఇవ్వడం, ప్రజలకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రదేశాల్లో చాలా వరకు ఇప్పటికే భారత సైనిక మ్యాపుల్లో ఉన్నాయని, ఇప్పుడు సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చేర్చడం ద్వారా ప్రాదేశిక సరిహద్దులపై ఎలాంటి అస్పష్టత లేకుండా పోతుందని అధికారులు వివరించారు.1959 నాటి లాంగ్జూ ఘటన, 1962 యుద్ధంతో సంబంధం ఉన్న చారిత్రక ప్రదేశాలు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. పేర్లు మార్చినంత మాత్రాన అరుణాచల్ ప్రదేశ్ తమ అంతర్భాగమన్న వాస్తవం మారదని భారత్ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూనే ఉంది. ఈ తాజా నిర్ణయంతో తన ప్రాదేశిక సమగ్రత విషయంలో భారత్ ఎంత దృఢంగా ఉందో మరోసారి స్పష్టమైంది.

## సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు



**మొదటిపేజీ తరువాయి -** 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను ‘యాక్షన్ పాయింట్’గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## వేలమంది భారతీయులను వెనక్కి పంపిన కెనడా !




**మొదటిపేజీ తరువాయి -** (సీబీఎస్ఏ) విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి.2025 ఏడాది మొత్తంలో 3,779 మంది భారతీయులను బహిష్కరించగా, ఈ ఏడాది కేవలం ఆరు నెలల్లోనే ఆ సంఖ్యలో దాదాపు 88 శాతానికి చేరుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వలస నిబంధనలను కఠినతరం చేస్తున్న నేపథ్యంలోనే ఈ బహిష్కరణలు పెరిగినట్లు స్పష్టమవుతోంది. అంతర్జాతీయ విద్యార్థులు, తాత్కాలిక విదేశీ కార్మికుల సంఖ్యను తగ్గించుకునేందుకు కెనడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ డేటా ప్రాధాన్యం సంతరించుకుంది.ఇప్పటివరకు కెనడా నుంచి బహిష్కరణకు గురైన వారి జాబితాలో మెక్సికన్లు అగ్రస్థానంలో ఉండేవారు. కానీ, ఈ ఏడాది భారతీయులు వారిని అధిగమించారు. తొలి అర్ధభాగంలో 3,323 మంది భారతీయులను బహిష్కరించగా, మెక్సికన్ల సంఖ్య 1,573గా ఉంది. గత ఐదేళ్లుగా బహిష్కరణల జాబితాలో మెక్సికో మొదటి స్థానంలో, భారత్ రెండో స్థానంలో కొనసాగాయి. చివరిసారిగా 2020లో 1,424 మందితో భారతీయులు అగ్రస్థానంలో నిలిచారు.వలస నిబంధనలను పాటించకపోవడం, వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోవడం, ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవడం, వీసా మోసాలకు పాల్పడటం వంటి కారణాలతోనే కెనడా ప్రభుత్వం ఎక్కువగా బహిష్కరణ వేటు వేస్తున్నట్లు తెలుస్తోంది. సీబీఎస్ఏ డేటా ప్రకారం.. మరో 7,669 మంది భారతీయులు బహిష్కరణ ప్రక్రియ జాబితాలో ఉన్నారు. అంటే.. సమీప భవిష్యత్తులో వీరిని కూడా దేశం విడిచి వెళ్లమని ఆదేశించే అవకాశం ఉంది.బహిష్కరణ ఉత్తర్వులు సాధారణంగా మూడు రకాలుగా ఉంటాయి. డిపార్చర్ ఆర్డర్ పొందిన వారు 30 రోజుల్లో స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లాలి. లేదంటే అది డిపోర్టేషన్ ఆర్డర్‌గా మారుతుంది. ఎక్స్‌క్లూజన్ ఆర్డర్ కింద ఒకటి నుంచి ఐదేళ్ల వరకు కెనడాలోకి తిరిగి ప్రవేశించకుండా నిషేధం విధిస్తారు. ఇక, డిపోర్టేషన్ ఆర్డర్ వస్తే.. కెనడా ప్రభుత్వ ప్రత్యేక అనుమతి లభించనిదే శాశ్వతంగా దేశంలోకి అడుగుపెట్టలేరు. అమెరికాతో పోలిస్తే కెనడా నుంచి బహిష్కరణకు గురవుతున్న భారతీయుల సంఖ్య రెండున్నర రెట్లు అధికంగా ఉండటం గమనార్హం.

## భారతీయులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే - ఫోన్‌పే సీఈఓ

**మొదటిపేజీ తరువాయి -** తెరదించారు. సాధారణ వినియోగదారులు యూపీఐ ద్వారా డబ్బు పంపేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. “భారతీయ వినియోగదారులందరికీ యూపీఐ ఉచితంగానే ఉంటుంది” అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. లోక్‌సభలో కొత్త పన్ను సవరణ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అంశంపై చర్చ మొదలైంది. దీంతో యూపీఐ వాడితే సామాన్యుల నుంచి కూడా ఛార్జీలు వసూలు చేస్తారా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.అయితే ఎండీఆర్ ఉంటే అది వ్యాపార సంస్థల పరిధిలోనే ఉంటుందని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలిపింది. చిన్న దుకాణాలు, కిరాణా వ్యాపారులు యూపీఐ చెల్లింపులు స్వీకరించేందుకు ఎలాంటి ఎండీఆర్ చెల్లించా ల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.డిజిటల్ చెల్లింపులు స్వీకరించే వ్యాపారులు పేమెంట్ సేవల సంస్థలకు చెల్లించే రుసు మునే ఎండీఆర్ అంటారు. కొత్త నిబంధనల ప్రకారం రూ.2,000కు మించిన కొన్ని వ్యాపార సంబం ధిత ఎలక్ట్రానిక్ చెల్లింపులపై 0.25 శాతం నుంచి 0.4 శాతం వరకు ఎండీఆర్ విధించే అవకా శం ఉంది. వ్యక్తిగతంగా ఒకరి నుంచి మరొకరికి చేసే యూపీఐ చెల్లింపులకు ఇది వర్తించదు. కొత్త బిల్లు యూపీఐ వినియోగదారులపై నేరుగా ఛార్జీలు విధించడం లేదని పీసీఐ స్పష్టం చేసింది. దాదాపు పదేళ్లుగా బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ, ఆర్‌బీఐ కలిసి యూపీఐ వ్యవస్థ నిర్వహణ, సైబర్ భద్రత, మోసాల నివారణ వంటి ఖర్చులను భరిస్తున్నాయి. ఇకపై ఈ వ్యవస్థకు స్థిరమైన ఆర్థిక నమూనాపై చర్చ జరుగుతోంది.

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. ‘హైడ్రా’ పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## తెలంగాణలో త్వరలో మద్యం ధరల పెంపు!



**మొదటిపేజీ తరువాయి -** బ్రాండ్ల ధరలను పెంచేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై ఏర్పాటు చేసిన సబ్-కమిటీ, సవరించిన ఎంఆర్‌పీ ధరలతో కూడిన నివేదికను గురువారం ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన తర్వాత ఎక్సైజ్ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.రాష్ట్రంలో చివరిసారిగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో మద్యం ధరలను సవరించారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి ధరలను సమీక్షించాల్సి ఉన్నప్పటికీ, గత మూడేళ్లుగా పెంపుదల లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మద్యం తయారీ సంస్థలు (డిస్టిలరీలు) ప్రభుత్వానికి విన్నవించాయి. ముడిసరుకుల ధరలు, రవాణా ఛార్జీలు, సిబ్బంది జీతాలు, పన్నుల భారం గణనీయంగా పెరిగిందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ‘ధరల నిర్ణయ కమిటీ’ని ఏర్పాటు చేసి, డిస్టిలరీల ప్రతినిధులతో చర్చలు జరిపింది. పెరిగిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీ ఈ నివేదికను రూపొందించింది.ప్రస్తుత పరిస్థితుల్లో 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని డిస్టిలరీలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ధరల పెంపు విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. మద్యం ధరలను భారీగా పెంచితే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి మద్యం అక్రమ రవాణా పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుంది. అందుకే, పొరుగు రాష్ట్రాల్లోని ధరలతో పోల్చి చూసిన తర్వాతే పెంపుదల శాతాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. సబ్-కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే ప్రభుత్వం తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం 09 - 08 - 2026

# రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు సమిష్టిగా కృషి చేద్దాం

## జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పోచారం, ఎమ్మెల్యేలు

## నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన కొనసాగిన సమావేశం

## వర్చువల్ ద్వారా పాల్గొన్న కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్







**ఉమ్మడి జిల్లా బ్యూరో (కబురు న్యూస్), ఆగస్టు 8 :** నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమిష్టిగా కృషి చేద్దామని శాసన సభ్యులు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలు విచ్చేయగా, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు, కౌలాస్ నాలా, పోచారం, రామడుగు తదితర జలాశయాలలో నీటి నిల్వల స్థితిగతులు, ఆయకట్టు పంటలకు సాగు నీటిని అందించే వెసులుబాటు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణకై రైతులకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ జలాశయాల ద్వారా యాసంగి పంటలకు సాగు నీటిని అందించేందుకు వీలుగా ప్రతీ సంవత్సరం రబీ సీజన్ సమయంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశాలు జరిగేవని గుర్తు చేశారు. అయితే ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ సమయంలోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల మునుముందు వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు ఉన్నందున, వరి పంట విత్తుకున్న రైతులు నష్టపోకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇంకా పంట వేసుకోని రైతులు ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం నారు ముదిరిపోయినందున వరి నాట్లు వేసే సమయం మించిపోయిందని, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడమే మేలు చేకూరుస్తుందని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన తోడ్పాటును అందించాలని హితవు పలికారు.

నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, ఇటీవల తుపాను ప్రభావంతో కొంతవరకు వర్షాలు కురిసినప్పటికీ, ఎల్ నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 3.96 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట వేసుకున్నారని, కమాండ్, నాన్ కమాండ్ ఏరియాలలో ఇంకనూ 45 వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు విత్తుకోవాల్సి ఉన్నందున వరికి బదులుగా జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, పప్పుదినుసులు వంటి ఆరుతడి పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు ఎంతో శ్రేయస్కరం అయినందున వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. 80 టీ.ఎం.సీల పూర్తిస్థాయి సామర్థ్యం కలిగిన శ్రీరాంసాగర్ రిజర్వాయర్ లో గత ఏడాది తరహాలోనే ఈసారి కూడా ప్రస్తుత సమయానికి 40 టీ.ఎం.సీల నీరు నిలువ ఉందన్నారు. అయితే ఈ రిజర్వాయర్ ద్వారా ఆయకట్టు పంటలకు ఏ మేరకు సాగునీటిని విడుదల చేయాలన్నది ఈ నెలాఖరు (ఆగస్టు చివరి వారం)లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న శివం కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద నిజామాబాద్ జిల్లాలో లక్షా 15 వేల ఆయకట్టు విస్తీర్ణం ఉందని, ఈ జలాశయంలో ప్రస్తుతం 10.78 టీ.ఎం.సీల నీరు నిలువ ఉన్నందున ఆయకట్టుకు మూడు నుండి నాలుగు తడులు సాగు నీటిని అందించేందుకు అవకాశం ఉందన్నారు. రైతులు వేసుకున్న వరి పంటను పరిరక్షించేలా, ఇంకనూ పంటలు విత్తుకోని భూములలో ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.

కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతున్న సింగూర్ రిజర్వాయర్ కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా సామర్థ్యం మేరకు నీటిని నిలువ ఉంచే పరిస్థితి లేదని, ప్రస్తుతం నిలువ ఉన్న 4.140 టీ.ఎం.సీల నీటిని తాగునీటి సరఫరాకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇది 60 నుండి 90 రోజులకే సరిపోతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వర్షాలు కురిసినట్లయితే మరో 4 టీ.ఎం.సీల వరకు వరద జలాలను సింగూర్ లో నిలువ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తద్వారా పై మూడు జిల్లాలకు వచ్చే ఐదారు నెలల వరకు తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఉండదని సూచించారు. భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందేలా జిల్లాలో జలసిరి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామని తెలిపారు. కాగా, కామారెడ్డి జిల్లాలోని కౌలాస్ నాల, పోచారం ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి మట్టాన్ని సంతరించుకున్నాయని, నిర్దేశిత ఆయకట్టుకు సాగు నీటిని అందించవచ్చని అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ కూడా చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బోరుబావులపై ఆధారపడి అత్యధిక మంది రైతులు పంటలు సాగు చేస్తున్నందున భూగర్భ జలాలు వృద్ధి చెందేలా వాటర్ షెడ్ కార్యక్రమాలను విరివిగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ, నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతంగా ఉన్న ఆర్మూర్ నియోజకవర్గానికి కాలువలు సక్రమంగా లేక సాగర్ జలాలు అందడం లేదని అన్నారు. కేవలం గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 40వేల ఎకరాలకు సాగు నీరు అందుతోందని తెలిపారు. దీనివల్ల అనేకమంది బతుకుదెరువు కోసం గల్ఫ్ కు వలస వెళ్ళారని, ప్రస్తుతం సాగునీటిని అందించకపోతే మరింత మంది గల్ఫ్ బాట పట్టే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్మూర్, ఆలూర్, నందిపేట తదితర మండలాల లోని ఆయకట్టుకు ఎత్తిపోతల ద్వారానైనా సాగు నీటిని అందించాలని కోరారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులను సవాల్ గా స్వీకరిస్తూ, అన్ని వర్గాల వారిని దీని ప్రభావం బారి నుండి కాపాడేలా అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. తుపాను ప్రభావం వల్ల ఇటీవల కురిసిన వర్షాలు కొంత ఉపశమనం కలిగించాయని, అందుబాటులోకి వచ్చిన నీటి వనరులను వృథా కాకుండా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మెరిసిన నిజామాబాద్ క్రీడాకారులు

## క్రీడాకారులను అభినందించిన పోలీసు కమిషనర్





**ఉమ్మడి జిల్లా బ్యూరో (కబురు న్యూస్) ఆగస్టు 8:** థాయిలాండ్‌లో జరిగిన 9వ హీరోస్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షి ప్‌లో నిజామాబాద్ క్రీడా కారులు తమ సత్తా చాటారు. నిజామాబాద్, తెలంగాణ, భారతదేశా నికి అపారమైన గౌరవా న్ని తీసుకువస్తూ బోధన్ రోడ్, ఎన్ఆర్ఐ కాలనీ లో ఉన్న తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా (టీఎంఏఏఐ) విద్యార్థులు థాయిలాండ్‌లోని పట్టా యాలో ఉన్న ఈస్టర్న్ నేష నల్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెం టర్‌లో నిర్వహించిన ప్రతి ష్టాత్మక 9వ హీరోస్ అంత ర్జాతీయ తైక్వాండో చాంపి యన్‌షిప్‌లో అద్భుత ప్రద ర్శన కనబరిచారు. ఈ అంతర్జాతీయ చాంపియ న్‌షిప్‌లో 33 దేశాల నుం డి 4403 కంటే ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొ నడంతో ఇది అత్యంత పోటీతో కూడిన ప్రపంచ తైక్వాండో ఈవెంట్లలో ఒకటిగా నిలిచింది. భార తదేశాన్ని ప్రాతినిధ్యం వహిస్తూ టీఎంఏఏఐకి చెందిన ముగ్గురు ప్రతిభా వంతులైన విద్యార్థులు మొత్తం 4 పతకాలు సాధించి విశేష విజయా న్ని సాధించారు.

**ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు..**

షేఖ్ మైతాబ్ అహ్మద్ (–81 కిలోలు) రెండు విభా గాల్లో పోటీ చేసి 1 బంగా రు పతకం, 1కాంస్య పత కం గెలుచుకుని తన ప్రతి భ ను చాటాడు. షేక్ తల్హా (–41 కిలోలు) శక్తివంత మైన ప్రదర్శనతో ఒక వెం డి పతకం సాధించాడు ఇల్హాన్ అబ్దుల్లా ఫారూకీ (–31 కిలోలు) అద్భుత మైన సంకల్పం, పోరాట స్ఫూర్తితో ఒక కాంస్య పతకం సాధించాడు.

**అంతర్జాతీయ వేదికపై నిలబెట్టడంలో అబ్దుల్లా ఫారూకీ.. కీలక పాత్ర**

ఈ విశేష విజయాలు టీఎంఏ ఏఐలో డా. అబ్దు ల్లా ఫారూకీ, అంతర్జాతీ య కోచ్, రిఫరీ, భారత గౌరవ రత్న సమ్మాన్ అవా ర్డు గ్రహీత మార్గదర్శక త్వంలో అందుతున్న క్రమశిక్షణ, అంకితభావం, ఉన్నత స్థాయి శిక్షణను ప్రతిబింబిస్తున్నాయి. ఆ యన ఈ యువ ఛాంపియ న్లను తీర్చిదిద్దడంలో, నిజామాబాద్‌ను అంత ర్జాతీయ వేదికపై నిలబె ట్టడంలో కీలక పాత్ర పోషించారు.

**క్రీడాకారులను అభినందించిన సిపి**

ప్రతిభ కనబరిచిన క్రీడా కారులను పోలీస్ కమిష నర్ సాయి చైతన్య అభి నందించారు.ఆయన పత క విజేతలకు సర్టిఫికెట్లు అందజేసి వారి విజయా లను ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చు రుకుగా పాల్గొనాలని, ఆరోగ్యకరమైన విజయ వంతమైన జీవితానికి శారీరక దారుఢ్యం, క్రమ శిక్షణ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు ఆత్మవిశ్వాసం, వ్య క్తిత్వ వికాసం, బలమైన భవిష్యత్తును నిర్మించ డంలో కీలకమని నిజా మాబాద్ ఏసీపీ ప్రకాష్ పేర్కొన్నారు. ముఖ్యంగా తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు ముందుకు వచ్చి చురు కుగా పాల్గొనాలని పిలు పునిచ్చారు. మాజీ ఉప మేయర్ మిర్ మజాజ్ అలీ సాహబ్ కూడా తమ నివాసంలో తైక్వాండో విద్యార్థులందరినీ సన్మా నించి పతక విజేతలను అభినందించారు. నిజా మాబాద్‌కు చెందిన ఈ క్రీడాకారులు భవిష్యత్తు లో ఇన్‌షా అల్లాహ్ ఆసి యా ఒలింపిక్ పత కాల ను సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురా వాలని శు భాకాంక్షలు తెలి పారు. ఈ యువ క్రీడాకా రుల విజయాలు వారి తల్లిదండ్రులు, తైక్వాండో సమాజం, మొత్తం నిజా మాబాద్ జిల్లాకు అపార మైన ఆనందం, గర్వాన్ని కలిగించాయి. ఈ విజ యం కష్టపడి పని చేయ డం, అంకితభావం, పెరు గుతున్న క్రీడా సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తోంద న్నారు. ఈ విజయం నిజా మాబాద్ , తెలంగాణకు గౌరవాన్ని మాత్రమే కాకుం డా ప్రపంచ తైక్వాండో వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింత బలపరు స్తుందన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ

## రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా




**నిజామాబాద్ (కబురు న్యూస్)ఆగస్టు 8 :** కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ చేయడం జరిగిందని కలెక్టర్ భవేష్ మిశ్రా వెల్లడించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీ.సీ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణను చేపట్టి ముసాయిదా జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలో 1565 పోలింగ్ కేంద్రాలు కొనసాగుతుండగా, హేతుబద్దీకరణ చేసిన మీదట వాటి సంఖ్య 1591 కి చేరిందని తెలిపారు. ఓటర్ల సంఖ్య, ఇతర అంశాలను ప్రాతిపదికగా చేసుకుని 28 పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయాలని, బాన్సువాడ సెగ్మెంట్ పరిధిలోని రెండు పోలింగ్ కేంద్రాలను తొలగించాలని ముసాయిదా జాబితాలో ప్రతిపాదించడం జరిగిందన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించిన వాటిలో ఆర్మూర్ నియోజకవర్గం 12, బోధన్ లో 9, బాన్సువాడలో 1, నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాలలో 3 చొప్పున ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు పురోగతి గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్, బాన్సువాడ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.ం

# శతచండీ యాగంతో ఇందూరు పావనం

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ





**ఉమ్మడి జిల్లా బ్యూరో (కబురు న్యూస్) ఆగస్టు8:** శత చండీయాగంతో ఇందూరు పావనమైందని, లోక కళ్యాణార్థం యాగం చేయడం అద్భుతమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన శత చండీయాగం లో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ యాగంతో ఎల్ నినో పరిస్థితులను అధిగమించి మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల యాగం ఫలితం మొదటి రోజే చూశామని సమృద్ధిగా వర్షం కురిసిందని గుర్తు చేశారు. రైతు బాగుంటే అందరూ బాగుంటారని, దేశం బాగుంటందన్నారు. హిందూ ధర్మంలో మాత్రమే “సర్వే జన సుఖినో భవంతు” అని అంటారని, అందరికోసం వేడుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యాగం నిర్వహణకు కృషి చేసిన అన్ని సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో సురేష్ షెట్కర్ మరిన్ని మైలురాళ్లు అధిగమించాలి....

## కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

## బాన్సువాడలో ఘనంగా ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలు





**కబురు న్యూస్ బాన్సువాడ, ఆగస్టు 8:** బాన్సువాడ పట్టణంలోని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ నివాసంలో శనివారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలోని రోగులకు కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సురేష్ షెట్కర్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో మరిన్ని సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో బలంగా వినిపిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసద్ బిన్ మోసీన్, జిల్లా యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, నాయకులు షాహబ్, రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, గుడాల నగేష్, కొట్టం గంగాధర్, గోపాల్‌రెడ్డి, ఎజాస్ ,నార్ల రవీందర్, హకీమ్, నర్సన్నచారి, శివదయాళ్, నాగులగామ వెంకన్న గుప్తా, రమేష్, కాశీరాం, షోయెబ్, గౌస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం...



**కబురు న్యూస్, బోధన్ ఆగస్టు 08 :** బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో గల జగజ్జనని మందిరం ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ పోరెడ్డి గంగాధర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పేర్కొన్నారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రూమ్మజ్జి, డిసిసి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బొర్రా పల్లన్న, కార్యదర్శి రంజిత్, గొల్ల సాయిలు, తోట రాజు, నర్ర పెద్ద సుదర్శన్, లింగం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణమాసం ప్రత్యేక పూజల కరపత్రాల ఆవిష్కరణ...



**కబురు న్యూస్, బోధన్ ఆగస్టు 08..:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో ఈ నెల 13 నుండి 12సెప్టెంబర్ 2026 వరకు నెల రోజులపాటు జరిగే శ్రావణ మాస ప్రత్యేక పూజల కరపత్రాన్ని అభివృద్ధి కమిటీలు సభ్యులు శనివారం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి రాములు, అర్చకులు గణేష్ శర్మ, శివకుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు అంగటి లక్ష్మణరావు పటేల్, ఆర్గొండ శంకర్, జక్కం వీరప్ప, ఈరపురం మౌనిక పోశెట్టి, సిబ్బంది సుధాకర్ భక్తులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం 09 - 08 - 2026

# జర్నలిజానికి,వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ అవసరం



### ఐజేయూ సదస్సులో వక్తలు..






**కబురు న్యూస్, బెంగళూరు, ఆగస్టు 08 :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అనుబంధ సంఘమైన కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో “జర్నలిజానికి, వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ అవసరమా?” అనే అంశంపై శనివారం బెంగళూరులో సదస్సు జరిగింది.ఆగస్టు 8, 9 తేదీల్లో బెంగళూరులో జరుగుతున్న ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో భాగంగా ఈ సదస్సును నిర్వహించారు.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ది వైర్ వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ వరదరాజన్ కీలక ప్రసంగం చేశారు.సదస్సులో జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ,2020లో రెండు జర్నలిస్టుల చట్టాలతో సహా మొత్తం 13 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. ఈ చట్టాలను రద్దు చేయడానికి పార్లమెంటులో ఎటువంటి నిర్దిష్ట కారణాన్ని వెల్లడించలేదని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చట్టాల రద్దును న్యాయస్థానంలో సవాలు చేసేందుకు ఏదైనా చట్టపరమైన అవకాశం ఉందా అని ఆయన ప్రశ్నించారు.మీడియా ప్రేక్షక పాత్ర కాకుండా రిఫరీ పాత్రను పోషించాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి సూచించారు. ప్రస్తుతం జర్నలిజం పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ నూతన తరానికి చెందిన, డిజిటల్ మీడియా జర్నలిస్టులు తాము రిపోర్ట్ చేసే అంశాలు, సమస్యలపై లోతైన అధ్యయనం చేసి, వాస్తవాలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని సూచించారు. దీనివల్ల మీడియా విశ్వసనీయత గణనీయంగా పెరుగుతుందని ఆయన చెప్పారు. “జర్నలిస్టులకు రక్షణ అవసరం అనడంలో ఎలాంటి సందేహం లేదు” అని ఆయన వ్యాఖ్యానించారు.రద్దు చేసిన చట్టాల గురించి విస్తృతంగా ప్రస్తావించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వం ఎటువంటి ముందస్తు సంప్రదింపుల ప్రక్రియ లేకుండా అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఇంత కీలకమైన నిర్ణయం తీసుకునే ముందు జర్నలిస్టులతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని ఆయన ఆక్షేపించారు. జర్నలిస్టులను ఇతర వృత్తుల్లో పనిచేసే వారితో సమానంగా చూడలేమని కూడా ఆయన స్పష్టం చేశారు.సిద్ధార్థ వరదరాజన్ మాట్లాడుతూ “భారతదేశంలో జర్నలిజానికి, జర్నలిస్టులకు రక్షణ అవసరం” అని కచ్చితంగా చెప్పారు.గతంలో వివాదాస్పద, ఘర్షణాత్మక అంశాలను రిపోర్ట్ చేసే జర్నలిస్టులు ఎదుర్కొనే ప్రధాన ముప్పుల్లో పరువునష్టం కేసులు ఒకటిగా ఉండేవని ఆయన అన్నారు. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని, జర్నలిస్టులు దేశద్రోహం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)తో పాటు ఇతర తీవ్రమైన చట్టాల కింద కేసులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పబ్లిక్ సేఫ్టీ యాక్ట్‌ను ప్రయోగించడం ద్వారా కూడా జర్నలిస్టులను అణచివేసే ప్రయత్నాలు జరిగాయని, వారిపై తీవ్రమైన అభియోగాలు మోపుతున్నారని వరదరాజన్ విమర్శించారు. ప్రభుత్వ అడ్వర్టయిజ్ మెంట్లు, ప్రజా సంబంధాలకు కేటాయించిన నిధులను ఉపయోగించి మీడియా సంస్థలపై ప్రభావం చూపేందుకు ప్రయత్నించడం స్వతంత్ర, నిష్పాక్షిక జర్నలిజానికి ఎదురవుతున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటని ఆయన పేర్కొన్నారు.

2024 ఎన్నికల సమయంలో ప్రభుత్వం డిజిటల్ మీడియాపై నియంత్రణ సాధించలేకపోయిందని,అయితే ఆ తర్వాత ఐటీ చట్టం అమలుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల సహాయంతో మీడియాపై నియంత్రణ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారని వరదరాజన్ ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పుడు డిజిటల్ సర్వీసెస్ బ్రాడ్‌కాస్టింగ్ చట్టం ముసాయిదాను రూపొందించే దిశగా ముందుకు సాగుతోందని కూడా ఆయన తెలిపారు.కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానుమ్ మాట్లాడుతూ, జర్నలిస్టులు ఐక్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు.“మనం అనైక్యంగా ఉన్నందు వల్ల విశ్వసనీయత తగ్గిపోతోంది” అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



ఐజేయు మాజీ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ,స్వాతంత్రోద్యమ అనంతరం నాయకులు జర్నలిస్టుల హక్కుల కోసం, వారి పని పరిస్థితులు మెరుగుపరచడంపై దృష్టి సారించారని, నేటి నాయకులు మీడియా హక్కుల హననంపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాల తో పాటు 13 చట్టాలను రద్దుచేసి, 29 చట్టాలతో కూడిన 4 కార్మిక స్మృతులకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆరు జాతీయ సమ్మెలకు మద్దతు ఇచ్చామని, రద్దుకు వ్యతిరేకంగా పార్లమెంటరీ కమిటీకి సైతం వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. నాలుగు కోడ్స్ నోటిఫికేషన్ను అమలు చేయకుండా నిలిపేసిన కర్ణాటక,తమిళనాడు, కేరళ రాష్ట్రాల స్ఫూర్తిని అభినందించారు.ఈ సెమినార్ ఐ జె యు భవిష్యత్ కార్యాచరణకు దిశ నిర్దేశం చేస్తున్నదని శ్రీనివాసరెడ్డి అన్నారు.వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్,వేజ్ బోర్డు పునరుద్ధరణ కోస...

# చారిత్రక కట్టడం వంద స్తంభాల గుడిని పరిరక్షించాలి...

**కబురు న్యూస్, బోధన్ ఆగస్టు 08** : బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో చత్రపతి యువజన సంఘం ఆధ్వర్యములో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా సంఘం అధ్యక్షుడు అడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... బోధన్ పట్టణంలో అతి పురాతన చారిత్రక ప్రాశస్త్యం కలిగిన వంద స్తంభాల ఇంద్ర నారాయణ స్వామిగుడిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిరక్షించి, అభివృద్ధి చేయాలని చత్రపతి యువజన సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆలయం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకుంటున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని సంఘం ప్రతినిధులు ఆవేదనవ్యక్తం చేశారు. బోధన్‌కు ప్రాచీన చరిత్ర ఉందని, వంద స్తంభాల గుడికి కూడా విశిష్టమైన చారిత్రక ప్రాధాన్యత ఉందని తెలిపారు. రామప్ప దేవాలయం, వరంగల్ వేయి స్తంభాల గుడి, హైదరాబాద్ గోల్కొండ కోట,చార్మినార్ వంటి చారిత్రక కట్టడాలను ప్రభుత్వం పరిరక్షిస్తున్న తరహాలోనే బోధన్ వంద స్తంభాల గుడిని కూడా పురావస్తు శాఖ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విషయంపై గత నెల 21న ప్రభుత్వాధికారులకు న్యాయపరమైన (లీగల్ ) నోటీసులు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మ్యూజియం శాఖ,




ఎండోమెంట్స్ శాఖ, నిజామాబాద్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, రెవిన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ తదితరులకు లీగల్ నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఇంద్ర నారాయణ స్వామి ఆలయంలో పూజలకు అనుమతి కల్పించడంతో పాటు, ఆలయ చరిత్రపై ప్రభుత్వం (ఆర్కలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి పరిశోధన చేయాలని కోరారు. ప్రభుత్వం నోటీసు పంపిన 60 రోజుల్లో సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకం ఉందని, ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోతే న్యాయపరంగా పోరాటానికి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. వంద స్తంభాల గుడి పరిరక్షణ కోసం అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు,చరిత్రకారులు,మేధా వులు,విద్యార్థులు, యువతతో కలిసి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈఅంశంపై ఎలాంటి రాజకీయ విభేదాలకు తావులేకుండా శాంతియుతంగా, న్యాయబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆలయానికి 1 ఎకరం 20 గుంటల విస్తీర్ణం ఉన్నట్లు పేర్కొంటూ, ఆలయ పరిధిలోని స్థలాన్ని పరిరక్షించి, ఎటువంటి ఆక్రమణలు లేదా నిర్మాణాలకు అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత. భవిష్యత్ తరాలకు మన చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించాలంటే ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.మీడియా సమావేశంలో ధర్మపురి, అశోక్ గౌడ్, గోపి కిషన్, రాజులదేవి పవన్, పెర్కా వెంకటేష్, కందికట్ల వాసు, దుర్గా ప్రసాద్, గౌతమ్, బూమేష్, నిమ్మ శ్రీనివాస్, శివరాజ్, శ్రీకాంత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీని బలోపేతం చేయడమే మా లక్ష్యం..

### తెలంగాణలో జనసేన అధికారంలోకి రావడం ఖాయం..
### ప్రజలు మార్పు కోరుతున్నారు...
### జననేత ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం..
### జహీరాబాద్, నిజా మాబాద్ పార్లమెంటరీ సమావేశంలో రాష్ట్ర నాయకులు..



**ఉమ్మడి జిల్లా బ్యూరో (కబురు న్యూస్)** ఆగస్టు 8:తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని బలోపేత చేయడమే మా లక్ష్యమని జనసేన పార్టీ రాష్ట్ర ఇం చార్జ్ శంకర్ గౌడ్, మీసాల ఫౌండేషన్ చైర్మన్, జనసే న పార్టీ రాష్ట్ర నాయకులు మీసాల శ్రీనివాసరావు అ న్నారు. శనివారం నిజా మాబాద్ జిల్లా కేంద్రంలోని సుగుణ గార్డె న్ లో మీసా ల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర నాయకులు మీసాల శ్రీనివాస రావు ఆధ్వర్యం లో నిర్వహించిన నిజా మాబాద్, జహీరాబాద్ పార్లమెంటరీ సన్నాక సమావేశ కార్యక్ర మానికి జనసేన రాష్ట్ర నాయకు లు, హీరో తనీష్, చక్ర వాకం, మొగలిరేకులు ఫేమ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్ నాయు డులు , రాష్ట్ర నాయకులు మచ్చ శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, సురేష్ రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రముఖులు ముఖ్య అతి థిలుగా హాజరయ్యారు. జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేత దిశగా సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాలకు చెంది న జనసేన సైనికులు, కా ర్య కర్తలు, నాయకులు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

**బిజెపితో పొత్తుపై నిర్ణయించేది జాతీయ నాయకులు..**

జనసేన రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్

బిజెపితో జనసేన పార్టీ పొత్తు ఉంటుందా లేదా అనేది నిర్ణ యించేది జాతీయ నాయకు లని జనసేన రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్ అన్నారు. పొ త్తు విషయమై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామ చందర్ వ్యాఖ్యలను పరిగ ణలోకి తీసుకోమన్నారు. జాతీయస్థాయిలో ఇరు పార్టీల జాతీయ నాయ కు లు కలిసి తీసుకునే నిర్ణ యం అన్నారు. ఈ సమా వేశ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు కార్య కర్తలు హాజరవడంపై సం తోషంగా ఉందన్నారు. జననేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని అధికారంలోకి తీసుకు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో జనసేన పార్టీ ని అధికారంలోకి తీసుకురావడం ఖాయం..

**జనసేన రాష్ట్ర నాయకులు మీసాల శ్రీనివాసరావు**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుతు న్నారని రాష్ట్రంలో జన సేన పార్టీని అధికారంలో కి తీసుకురావడం ఖాయ మని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు మీసాల శ్రీని వాసరావు అన్నారు. జన సేన పార్టీ అధినేత ఆదే శాల మేరకు జనసేన పార్టీ బలోపేతం దిశ గా రాష్ట్రం లోని అన్ని పార్ల మెంటరీ నియోజకవర్గాల్లో సమా వేశాలు నిర్వహిస్తు న్నామ ని తెలిపారు. ఈ సంద ర్భంగా జహీరాబాద్, నిజా మా బాద్ పార్లమెంటరీ సమావేశా లను నిజామా బాద్ లో నిర్వ హించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలం గాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని మండి పడ్డారు. యువత, రైతులు, మేధావులు, మహిళలు మా ర్పు కోరుతు న్నారని రాష్ట్రం లో ప్రత్యామ్నాయ పార్టీ ఏదైనా ఉంది అంటే.అది జనసేన పార్టీ యే అని మీసాల శ్రీనివా సరా వు నొక్కి చెప్పారు.




రాష్ట్రంలో జనసేన పార్టీని బలోపే తం చేయడమే మా లక్ష్య మని అన్నారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, జిహెచ్ఎంసి ఎన్ని కల్లో జనసేన పార్టీ పోటీ చేయ నుందని తెలిపారు. అదే విధం గా అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్, కాంగ్రె స్ పార్టీలు బీసీని ముఖ్య మంత్రి చేయ లేదని కానీ జనసేన పార్టీ బీసీ బిడ్డను ముఖ్యమంత్రి చేయ డానికి గట్టి సంకల్పంతో ఉందన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను ప్రజలు ఇష్టపడుతు న్నారని జన నేత ఆశయా లను తెలంగాణ రాష్ట్ర ప్రజల్లోకి తీసుకెళ్లి జనసేన పార్టీ బలోపేతం దిశ గా ప్రత్యేక కార్యచరణ చేప ట్టామని తెలిపారు.ఈ కార్య క్రమంలో పరిశీలకు లు శర్మ, మీడియా ఇన్‌చా ర్జ్ దుంపాటి శ్రీనివాస్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిఘా వ్యవస్థను పటిష్టపరిచాలి...

### విచారణలో నూతన పద్ధతులను ఉపయోగించాలి...
### ఫిర్యాదు వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించాలి..
### డిఐజి భాస్కరన్...






**కబురు న్యూస్,బోధన్ ఆగష్టు 08..** బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ను డిఐజి ఆర్.భాస్కరన్ (బాసర జోన్) శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సిబ్బందికి అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు ఫిర్యాదుల నమోదు విధానం, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల డిజిటల్ నిర్వహణ సిబ్బంది హాజరు, డ్యూటీ విధానాలు తదితర అంశాలపై కూడా డి.ఐ.జీ. ఆరా తీశారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా క్రమశిక్షణతో పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ప్రధానంగా అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని , ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. బోధన్ పోలీస్ స్టేషన్ సరిహద్దులో మహారాష్ట్ర వునందున అన్నీ ప్రధాన రహదారులపై నిఘా పటిష్టపరిచాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసం యువతను ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేయాలని అన్ని గ్రామాలలో డ్రగ్స్ వాడకం నిషేధమని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతీ కేసులో ఇన్వెస్టిగేషన్ నందు ప్రస్తుతం ఉన్నటువంటి టెక్నాలజీ పద్ధతులను ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ తనిఖీలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఏసిపి పి.శ్రీనివాస్, ఎస్హెచ్ఓ వెంకటనారాయణ, ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, టౌన్ ఎస్సై హబీబ్ ఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ం

# సేవాభావులను లయనిజంలోకి ఆహ్వానించాలి

### లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయాలి...
### ప్రజోపయోగ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి..పి.బసవేశ్వరరావు..





**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, ఆగస్టు 08** :సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంతో పాటు సేవాభావం ఉన్న వారిని లయనిజంలోకి ఆహ్వానించి, లయన్స్ సేవలను మరింత విస్తరించాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పి.బసవేశ్వరరావు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్ర మాల నిర్వహణకు లయన్స్ క్లబ్బులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ సందీప్ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా పి.రాఘవేందర్, కార్యదర్శిగా చింతల గంగాదాస్,కోశాధికారిగా అంకం రాజేందర్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.బసవేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్బులు నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు.సమాజంలోని అవసరాలను గుర్తించి ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా లయనిజం సేవా స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.సేవ చేయాలనే తపన ఉన్న వారిని లయన్స్‌లోకి ఆహ్వానించి సభ్యత్వాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్లు డి.పెంటయ్య,ఇరుకుల వీరేశం,జిల్లా అడిషనల్ క్యాబినెట్ ట్రెజరర్ పి.లక్ష్మీనారాయణ,జిల్లా కార్యదర్శి డి.యాదగిరి,రీజియన్ చైర్మన్ పి.హన్మాండ్లు,రీజియన్ కార్యదర్శి నాగేశ్వరరావు,జోన్ చైర్మన్లు అబ్బాయి లింబాద్రి,హీరమల్ల విష్ణువర్ధన్,అందె శివాజి,ప్రోగ్రామ్ చైర్మన్ ఇరుమల శివలింగం తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరులో ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశం ప్రారంభం

### సమావేశాన్ని ప్రారంభించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి,‘ది వైర్’ వ్యవస్థాపకులు సిధార్థ్ వరదరాజన్..
### 23 రాష్ట్రాల జర్నలిస్టుల సంఘాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యుల హాజరు.







**కబురు న్యూస్,బెంగళూరు, ఆగస్టు 08** :కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయు) జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి.బెంగళూరు గేట్ హోటల్‌లో ఆగస్టు 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ‘ది వైర్’ మీడియా సంస్థ వ్యవస్థాపకులు సిధార్థ్ వరదరాజన్ సమావేశాన్ని ప్రారంభించారు.దేశవ్యాప్తంగా జర్నలిస్టులు,మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పాత్రికేయుల హక్కులు,మీడియా స్వేచ్ఛ తదితర అంశాలపై సమావేశంలో చర్చలు జరుగుతున్నాయి.ఐజేయూ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మీడియా అకాడమీ చైర్మన్లు కె. శ్రీనివాస్ రెడ్డి, అంజూమ్ ఖన్నన్, ఐజేయూ ప్రధాన కార్యదర్శి డి. సోమసుందర్, జాతీయ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, ఎస్.ఎన్. సిన్హా తదితరులు హాజరయ్యారు.అలాగే దేశంలోని 23 రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టుల సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, మీడియా స్వేచ్ఛ పరిరక్షణతో పాటు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం 09 - 08- 2026

# విహార యాత్రల్లో విభిన్న రుచులు, చారిత్రక కట్టడాలకు ముగ్ధులవుతున్న హైదరాబాదీలు

**సాంస్కృతిక, వారసత్వ కట్టడాలను వీక్షించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్న హైదరాబాద్ వాసులు**

**ఆయా ప్రాంతాల పండుగలు, వేడుకలను తిలకించేందుకు అమితాసక్తి**

**ట్రావెలింగ్‌లో హైదరాబాదీలు ఆసక్తి చూపుతున్న వాటి పట్ల ఓ సంస్థ సర్వే**

**హైదరాబాద్ వాసులు ఎక్కువగా వెళ్తున్న యాత్రా ప్రదేశాలు**



**కబురు న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 8 :** హైదరాబాద్ మహానగరవాసులది నిత్యం ఉరుకులు పరుగుల జీవితం. ఉద్యోగంలో ఒత్తిళ్లు, వ్యాపారంలో ఒడుదుడుకులు. వీటికి తోడు రోజూ ట్రాఫిక్‌లో తంటాలు. వీటి నుంచి ఉపశమనం పొందేందుకు అప్పుడప్పుడు ట్రావెలింగ్, టూరిజం చేస్తుంటారు. అయితే హైదరాబాదీలు ఇలా సందర్శనీయ ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు ఎక్కువగా వేటి మీద ఆసక్తి చూపుతున్నారో ఓ ట్రావెల్ సంస్థ వెల్లడించింది. రొటీన్ ప్లేసులు, వంటకాలకు బదులు భిన్నంగా ఉండేవాటి వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపింది. హైదరాబాద్ వాసులు దేశ, విదేశాల యాత్రలో భాగంగా అక్కడి సందర్శనీయ ప్రాంతాలకంటే సాంస్కృతిక, వారసత్వ కట్టడాలను వీక్షించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడి జీవనశైలి, సంప్రదాయాలకు ముగ్ధులవుతున్నారు. స్థానిక ప్రజల పట్ల అవగాహన పెంచుకునేందుకు ఇష్టపడుతున్నారు. ఆయా ప్రాంతాల ప్రత్యేక వంటకాలు, ఆహారం రుచి చూసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు 'స్కైస్కానర్' అనే ట్రావెల్ సంస్థ సర్వే వెల్లడించింది. టూరిజం వెళ్తున్న హైదరాబాద్ వాసుల్లో ఆహార అనుభూతులు, సాంస్కృతిక పర్యాటకానికి 56 శాతం మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడి పండుగలు, వేడుకలను తిలకించేందుకు 54 శాతం మంది ఆసక్తి కనబరుస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. 51 శాతం మంది ఆధ్యాత్మిక యాత్రలకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిపింది. మన దేశంలో విభిన్న సంప్రదాయాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే ప్రంతాలకు వెళ్లేందుకు హైదరాబాదీలు ఎక్కువగా ఇష్టపడుతున్నట్లు సర్వే నిర్వహిస్తున్న ఏజెన్సీ ప్రతినిధి నీల్ ఘోష్ తెలిపారు. దేశంలో ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలు అత్యంత సంపన్నమైన సాంస్కృతిక అనుభూతులను అందిస్తున్నాయి. ఆయా ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక వేడుకలు, పండుగులను వీక్షించేందుకు హైదరాబాద్ పర్యాటకులు ఇష్టపడుతున్నారు. ప్రధానంగా దీపావళి, దుర్గాపూజ, సంక్రాంతి, కుంభమేళా, బతుకమ్మ, బోనాలు, నవరాత్రి గర్బా ముందు వరుసలో ఉంటున్నాయి. హైదరాబాద్ నుంచి వెళ్తున్న పర్యాటకుల్లో అత్యధిక మంది జపాన్‌ను (సుమారు 22 శాతం) సందర్శిస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో థాయిలాండ్-వియత్నాం, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ ఉన్నాయి. నగరంలోని చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాలు, యాదగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, భద్రాచల రామాలయం, చిలుకూరు బాలాజీ వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శించుకునేందుకు ఎక్కువమంది పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

భద్రత, రద్దీ, వాతావరణ మార్పులు, వసతి లభ్యత, ప్రయాణ ఖర్చుల వంటి అంశాలు పర్యాటకానికి ప్రతిబంధకంగా ఉంటున్నాయని హైదరాబాద్ పర్యాటకులు సర్వేలో తమ అభిప్రాయం తెలిపారు. హైదరాబాద్ సిటీ టూర్ కోసం : ప్రస్తుతం పని నుంచి ఎక్కువ కాలం సెలవు తీసుకోలేని చాలా మంది హైదరాబాదీలు, వారాంతంలో తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సమీపంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తూ నగర పర్యటనలకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

ఇలాంటి వారి కోసం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ హైదరాబాద్ వాసులకు ఒక శుభవార్తను అందించింది. ఇతర పర్యాటక ప్రదేశాలతో పాటు యాదాద్రి, స్వర్ణగిరి వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలను కూడా కలుపుకొని ఒక అద్భుతమైన టూర్ ప్యాకేజీని ప్రవేశపెట్టింది. ప్రసిద్ధ ఆధ్యాత్మిక, చారిత్రక ప్రదేశాలను అనుసంధానించే విధంగా, "హైదరాబాద్ - యాదగిరిగుట్ట - స్వర్ణగిరి దేవాలయం" అనే పేరుతో ఒక ఆకర్షణీయమైన ప్యాకేజీని ప్రారంభించింది. ఈ టూర్ ప్రతి శనివారం అందుబాటులో ఉంటుంది. ఇందులో యాదగిరిగుట్ట, శిల్పారామం, కోలనుపాక జైన దేవాలయం, స్వర్ణగిరి దేవాలయం, పోచంపల్లి సందర్శనలు ఉంటాయి.

# రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి - 'మహానది' నుంచి తెలంగాణకు నాణ్యమైన బొగ్గు సరఫరా

**ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ సంస్థకు చెందిన గనుల నుంచి బొగ్గు**

**ప్రతి ఏటా 50 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గు రాష్ట్రానికి సరఫరా**

**ఆమోదం తెలిపిన కేంద్రం**



**కబురు న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 8 :** రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా కోల్ ఇండియా గనుల నుంచి నాణ్యమైన బొగ్గును తెలంగాణ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేసేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ సంస్థకు చెందిన గనుల నుంచి ప్రతి సంవత్సరం 50 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖల సమన్వయ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. సింగరేణి గనుల నుంచి నాణ్యమైన బొగ్గు సరఫరా కాకపోడంతో తెలంగాణ థర్మల్ ప్లాంట్లలో గత 27 నెలల్లో 9,593 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి నష్టం వాటిల్లింది. ఇంకోవైపు ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఉత్పత్తిని తగ్గించవద్దని అన్ని థర్మల్ కేంద్రాలకు కేంద్ర బొగ్గు శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని కోల్ ఇండియాకు చెందిన అనుబంధ సంస్థల గనుల నుంచి నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని జెన్‌కో సంస్థ ఇటీవల కేంద్ర బొగ్గు శాఖను కోరింది. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన మహానది కోల్‌ఫీల్డ్స్‌కు చెందిన ఒడిశాలోని తాల్చేరు ప్రాంత గనుల నుంచి బొగ్గును సరఫరా చేయడానికి కేంద్ర కమిటీ తాజాగా నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా రోజుకు గరిష్ఠంగా 5 గూడ్సు రైళ్ల (రేక్స్)లో బొగ్గును తీసుకెళ్లవచ్చని స్పష్టం చేసింది. మహానది గనులలో ఉత్పత్తి అవుతున్న జీ11 రకం బొగ్గు ధర టన్నుకు రూ.2300 ఖర్చు అవుతోంది. దీనికి అదనంగా కిరాయి, రైలు రవాణా, ఇతర ఖర్చులు కలుపుకొని మరో రూ.2 వేల ఖర్చు అవుతోంది. ఇలా మొత్తం కలిపి రూ.4,300 అవుతుందని జెన్‌కో అంచనా వేస్తోంది. ఇదే జీ-11 బొగ్గుకు సింగరేణి టన్నుకు రూ.4,941 చొప్పున వసూలు చేస్తోందని జెన్‌కో వర్గాలు వెల్లడించాయి. పైగా సింగరేణి జీ11 అని చెప్పి పంపిస్తున్న బొగ్గును ప్లాంట్లలో మండించినప్పుడు అక్కడి యంత్రాలు జీ13, జీ14, జీ15 అని చూపుతున్నాయని స్పష్టం చేశాయి. రైలు మార్గంలో రద్దీ దృష్ట్యా ముందు 2 రేక్స్ బొగ్గు తీసుకోవాలని జెన్‌కో భావిస్తోంది. అలాగే ఒడిశాలోని పారదీప్ పోర్టు నుంచి ఏపీలోని కాకినాడకు సముద్ర మార్గంలో తీసుకురావాలని, అక్కడి నుంచి కొత్తగూడెంనకు లేదా దామెరచర్లకు గూడ్సు రైళ్లలో తెప్పించాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. నిజానికి ఒడిశాలోనే సింగరేణికి నైనీ గనిలో బొగ్గు ఉంది. అయినప్పటికీ అక్కడి నుంచి రైలు మార్గం వరకు 80 కిలోమీటర్లకు పైగా రోడ్డు రవాణా చేయాల్సి ఉంటుంది. ఈ పని చేయడం కష్టమని భావించిన జెన్‌కో సంస్థ మహానది వైపు మొగ్గు చూపింది. ఇటీవల రాష్ట్రానికి నైనీ బ్లాక్ నుంచి బొగ్గు సరఫరా మొదలైంది. దీని ప్రారంభం వెనక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషి కీలకంగా మారాయని సింగరేణి యాజమాన్యం ఇటీవల పేర్కొంది. అనుమతుల సాధనలో ఎదురైన అనేక అడ్డంకులను పటాపంచలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ఈ విజయాన్ని సొంతం చేసుకుందని సింగరేణి సంస్థ వెల్లడించింది. అనుమతుల సాధన కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా రెండు సార్లు ఒడిశా రాష్ట్రానికి పర్యటనకు వెళ్లారని చెప్పింది. 2024 జులైలో తొలిసారిగా ఒడిశా వెళ్లిన ఆయన అక్కడి ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపారని, ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారని చెప్పుకొచ్చింది. బొగ్గు సరఫరాకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోవడంతో 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ప్రారంభించారు. ఒడిశా నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి తొలి బొగ్గు రైలు గురువారం విజయవంతంగా చేరుకుంది.

# అమరావతి-విజయవాడ మధ్య ఐకానిక్ వంతెన

**"సిగ్నేచర్ బ్రిడ్జి"కి టెండర్లు షురూ!**

**ప్రకాశం బ్యారేజీ దిగువన నూతన "సిగ్నేచర్ బ్రిడ్జి"**

**కృష్ణా నదిపై అంతర్జాతీయ ప్రమాణాలతో 6 వరుసల వంతెన**



**కబురు న్యూస్, అమరావతి, ఆగస్టు 8 :** కృష్ణా నదిపై అమరావతి, విజయవాడల అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశం బ్యారేజీకి 300 మీటర్ల దిగువన నూతన "సిగ్నేచర్" బ్రిడ్జిని నిర్మించబోతోంది. సీతానగరం ఘాట్ నుంచి కనకదుర్గ ఫ్లైవోవర్‌ను, మచిలీపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిని (ఎన్‌హెచ్-65) అనుసంధానిస్తూ ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ బ్రిడ్జి ఫీజిబిలిటీ రిపోర్టు, డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. రాజధానికి గేట్‌వేగా, ప్రముఖ పర్యాటక ఆకర్షణగా నిలిచేలా ఈ ప్రాజెక్టును ఆరు వరుసలతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విజయవాడ, అమరావతి నగరాల మధ్య రాకపోకలను మరింత వేగవంతం చేయడమే లక్ష్యంగా కృష్ణా నదిపై మరో కొత్త ఐకానిక్ వంతెన రూపుదిద్దుకోనుంది. ఈ నిర్మాణం పూర్తయితే సీతానగరం ఘాట్ మీదుగా అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుకు చేరుకోవడం వాహనదారులకు ఎంతో సులభతరం అవుతుంది. మొత్తం 1.10 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ఈ బ్రిడ్జిని కనకదుర్గ ఫ్లైవోవర్‌కు సులువుగా కలిపేందుకు వీలుగా ఎలివేటెడ్ విధానంలో డిజైన్ చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ వంతెనను 6 వరుసల విస్తరణతో పాటు ఇరువైపులా ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌లు, సైకిల్ ట్రాక్‌లతో ప్రణాళిక సిద్ధం చేశారు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టు కాన్సెప్ట్, డిజైన్లు, వ్యయ అంచనాలను ఎంపికైన కన్సల్టెన్సీ సంస్థ రూపొందిస్తుంది. ప్రాజెక్టు అధ్యయనం కోసం బిడ్‌లు దాఖలు చేయడానికి ఈనెల 26 వరకు గడువు ఇవ్వగా, ఎంపికైన సంస్థ మూడు నెలల్లోగా తన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన భారీ నిధుల కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (రుణదీ) లేదా ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించనున్నారు. రాజధాని అమరావతికి ఒక ప్రధాన ముఖద్వారంలా (గేట్‌వే) నిలిచేలా అత్యంత అధునాతన సాంకేతికతతో ఈ ల్యాండ్‌మార్క్ వంతెనను తీర్చిదిద్దనున్నారు. ప్రకాశం బ్యారేజీపై రోజురోజుకూ పెరుగుతున్న తీవ్రమైన ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడంలో ఈ నూతన సిగ్నేచర్ బ్రిడ్జి అత్యంత కీలక పాత్ర పోషించనుంది. విజయవాడ నగర సౌందర్యాన్ని పెంచడంతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా దీని డిజైన్లను అత్యంత రమణీయంగా రూపొందించనున్నారు. జాతీయ రహదారి ఎన్‌హెచ్-65తో నేరుగా అనుసంధానం కావడం వల్ల జిల్లాల మధ్య రవాణా వ్యవస్థ మరింత క్రమబద్ధీకరించనుంది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు, పారిశ్రామిక ప్రగతికి నూతన ఊపిరి పోస్తుందని భావిస్తున్నారు. ఈ నూతన సిగ్నేచర్ బ్రిడ్జి నిర్మాణం అమరావతి-విజయవాడ జంట నగరాల రవాణా స్వరూపాన్నే విప్లవాత్మకంగా మార్చివేసే అవకాశముంది. ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతూనే, ఈ ప్రాంతపు ఆర్థిక, పర్యాటక రంగాల పురోగతికి ఇది బలమైన పునాదిగా నిలుస్తుంది. నవ్యాంధ్ర రాజధాని వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్టు త్వరలోనే సాకారమై ప్రజలకు అందుబాటులోకి రానుంది.

# వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో అవకతవకలు జరిగాయి: సునీత

**నేడు వివేకానందరెడ్డి 75వ జయంతి**

**సమాధి వద్ద నివాళి అర్పించిన కుటుంబ సభ్యులు**

**ఏదో ఒక రోజు కచ్చితంగా తమకు న్యాయం జరుగుతుందన్న సునీత**



**కబురు న్యూస్, అమరావతి,, ఆగస్టు 8 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 75వ జయంతి సందర్భంగా పులివెందుల్లోని ఆయన సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత, కుటుంబ సభ్యులు నివాళు లర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన సునీతా రెడ్డి... వివేకా హత్య కేసు విచారణ, ఇటీవలి తీర్పులు సరిగా లేవని ఆరోపిస్తూ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. విచారణ సరిగా జరగకపోవడం వల్లే తాము పదే పదే కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య జరిగిందనే విషయం అందరికంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే తెలుసని సునీత ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విచారణలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ, ఏదో ఒక రోజు కచ్చితంగా న్యాయం జరుగుతుందనే గట్టి నమ్మకంతోనే తాను ఈ పోరాటాన్ని కొనసాగిస్తున్నానని తెలిపారు.

# మూసీ సుందరీకరణకు తొలి అడుగు

**ఫేజ్-1కు పర్యావరణ అనుమతులు**

**దసరాలోగా టెండర్ల ప్రక్రియకు సిద్ధమవుతున్న ఎంఆర్‌డీసీఎల్**

**రూ.7,055 కోట్లతో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు**

**పనులు ప్రారంభమైన రెండేళ్లలో ఫేజ్-1 పూర్తి చేయాలని లక్ష్యం**

**భూసేకరణ, చెట్ల తొలగింపునకు స్పష్టమైన ప్రణాళిక**



**కబురు న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 8 :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టు పనుల్లో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న మొదటి దశ (ఫేజ్-1) పనులకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (ఎస్ఈఐఏఏ) ఆగస్టు 5న ముందస్తు పర్యావరణ అనుమతులు (ఈసీ) జారీ చేసింది. ఈ అనుమతి లభించడంతో, దసరా పండుగలోపే టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డసీఎల్) కసరత్తు వేగవంతం చేసింది. హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 21 కిలోమీటర్ల మేర 'వి' ఆకారంలో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. దీని కోసం మొత్తం రూ. 7,055 కోట్లు ఖర్చు చేయనుండగా, పనులు ప్రారంభమైన నాటి నుంచి రెండేళ్లలోగా, అంటే 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. ఈ నిధులతో నదికి ఇరువైపులా 30 మీటర్ల వెడల్పుతో రోడ్లు, సర్వీసు రోడ్లు, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు, పంపింగ్ స్టేషన్లు, వరద నియంత్రణకు చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేస్తారు. వీటికి తోడు పచ్చటి కారిడార్లు, పార్కులు, సాంస్కృతిక కేంద్రాలను కూడా నిర్మించనున్నారు. నదిలో సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా వర్షాకాలంలో 30 శాతం, ఇతర సమయాల్లో 20 శాతం నీటి ప్రవాహం ఉండేలా చూడనున్నారు. మొదటి దశ కోసం మొత్తం 495 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 158 ఎకరాల ప్రభుత్వ, 146 ఎకరాల పట్టా, 30 ఎకరాల రక్షణ శాఖ భూములతో పాటు 126 ఎకరాల నదీ పరివాహక ప్రాంతం ఉంది. ఈ పరిధిలో 639 శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే 2,660 చెట్లలో చాలావాటిని మరోచోటికి తరలించనున్నట్లు, తప్పనిసరిగా తొలగించాల్సి వస్తే 1:10 నిష్పత్తిలో కొత్త మొక్కలు నాటనున్నట్లు అధికారులు తమ నివేదికలో స్పష్టం చేశారు. మొత్తం మీద, కీలకమైన పర్యావరణ అనుమతులు లభించడంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు మొదలుకానుండటంతో హైదరాబాద్ మహానగరానికి ఇది కొత్త శోభను తీసుకురానుందని ప్రభుత్వం భావిస్తోంది.

# 'ఇలాగైతే కుబేరుడూ కూలికి వెళ్తాడు'

**ఉచిత పథకాలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు**

**ఉచిత పథకాలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు**

**కోటీశ్వరులకూ రైతుబంధు ఇస్తారా అని సూటి ప్రశ్న**

**ఒక్క తెల్లకార్డూ తొలగించలేని పరిస్థితి ఉందని వ్యాఖ్య**




**కబురు న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 8 :** రాష్ట్రంలో పరిమితికి మించి అమలు చేస్తున్న ఉచిత పథకాల కారణంగా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయంటూ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇన్ని 'ఉచిత పథకాలను' అమలు చేసుకుంటూ పోతే కుబేరుడైనా పనికి ఆహార పథకం కింద కూలి పనికి వెళ్తాడని, ఆ అకౌంట్ పేరూ 'కుబేర' అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్లు విడుదల చేయాలని 2024లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలంటూ ఇచ్చిన వినతి పత్రాలపై చర్యలు తీసుకోకపోవడంతో కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె.రామకృష్ణ కోర్టు కంటెప్ట్ ఆఫ్ కోర్టు పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉచిత పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్థిక శాఖ చీఫ్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా వ్యక్తిగతంగా హైకోర్టులో హాజరై రూ.24 కోట్లు గత మే నెలలో చెల్లించామని, మిగిలినది వాయిదాల పద్ధతిలో ఆరు నెలల్లో చెల్లిస్తామని చెప్పారు. ఈ దశలో పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చి రెండేళ్లయినా నగదు చెల్లించలేదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి స్పందిస్తూ 'అధికారులు ఏం చేయగలరు మనకు వచ్చే ఆదాయమెంత. ఖర్చెంత రాష్ట్ర బడ్జెట్‌లో వేతనాలు, అప్పులకూ పోను మిగిలినదంతా సంక్షేమ పథకాలకే వెచ్చించాల్సిన పరిస్థితి. లబ్ధిదారులు ద్విచక్ర వాహనం, ఐఫోన్‌తో ఉచిత బియ్యం కోసం వెళుతున్నారు. కోటీశ్వరులకూ రైతుబంధు పథకం ఇవ్వడమేంటి దీనివల్ల ప్రభుత్వంపై ఎంత భారం పడుతోంది భవిష్యత్తులో పిల్లలకు ఏం మిగులుతుంది" అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇన్ని ఉచిత పథకాల అమలుపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ 'ఒక తెల్లరేషన్ కార్డునైనా తొలగించగలరా అలా తొలగిస్తే అదో రాజకీయమవుతుందన్నారు. ప్రభుత్వ శాఖాపరమైన వ్యవహారాల్లో ఒక్కో అధికారిపై 3 నుంచి 4 వేల కేసులున్నాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుత అధికారిపై 100కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ అధికారైనా ఏమీ చేయలేరు. రేపు మీరే సీఎం అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇది రాజకీయ ఉపన్యాసం కాదు. ఆవేదనతో చెబుతున్నా. అప్పులు తీర్చేందుకు ప్రభుత్వ భూములను విక్రయిస్తుంటే భవిష్యత్తు తరాల పరిస్థితి ఏమిటి' అని న్యాయమూర్తి అన్నారు. అప్పు చేసి ఎవరైనా బెంజ్ కారును కొంటారా ఎర్రబస్సులో వెళ్లే వాళ్లం ఎయిర్‌బస్‌లో వెళ్తామంటే ఆ ఫ్యామిలీ ఎంత కాలం నిలబడుతుంది తెలంగాణ రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలను అందిస్తున్నారు. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ పద్ధతి దీర్ఘకాలం ఆచరణ సాధ్యం కాదు. సమాజం ప్రమాదంలో పడబోతోంది. ఇవన్నీ ఎంతవరకు సాధ్యమో ఆయా ప్రభుత్వాలే తెలుసుకోవాలి" అని న్యాయమూర్తి అన్నారు. ప్రస్తుత కేసులో చెల్లింపులకు సంబంధించి అఫిడవిట్‌నూ దాఖలు చేయాలని సూచిస్తూ విచారణను 19వ తేదీకి వాయిదా వేశారు.

తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం 09 - 08- 2026

# బెల్లంముక్కతో ఎన్నో సమస్యలు దూరం

**వీటితో కలిపి తింటే సూపర్ బెనిఫిట్స్!**

**బీపీ, రక్తహీనత, అజీర్తి నెలసరి సమస్యలకు చెక్**

**విటమిన్లతో పాటు అనేక ఖనిజాలు పుష్కలం!**



**కబురు న్యూస్, ఆరోగ్యం, ఆగస్టు 8** :జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే బెల్లం తినాల్సిందే! మలబద్ధకం సమస్య వేధిస్తోందా? దానికీ బెల్లమే పరిష్కారం! నెలసరి నొప్పులతో బాధపడుతున్నారా? బెల్లం ఉందిగా! ఇలా చెప్పుకుంటూ పోతే బెల్లం తింటే నయం కాని అనారోగ్యమంటూ ఉండదంటే అది అతిశయోక్తి కాదని నిపుణులు చెబుతుంటారు. అయితే ఈ బెల్లాన్ని నేరుగా కంటే కొన్ని పదార్థాలతో కలిపి తీసుకుంటే దాని సుగుణాలు రెట్టింపు అవుతాయంటున్నారు. ఫలితంగా ఆయా ఆరోగ్య సమస్యల్ని తగ్గించడంలో బెల్లం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందని వెల్లడిస్తున్నారు. అజీర్తి దగ్గర నుంచి ఆకలిని అదుపు చేసే దాకా, నెలసరి సమస్యల్ని తగ్గించడం నుంచి చనుబాలు ఉత్పత్తి చేసే దాకా ఇలా ప్రతి ఒక్కటీ బెల్లంతో ముడిపడి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్లాన్ని ఏయే పదార్థాలతో కలిపి తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయో ఇప్పుడు తెలుసుకుందాం.బెల్లంలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎన్నో ఖనిజాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇంకా బి-కాంప్లెక్స్, సి, డి 2, ఇ వంటి విటమిన్లు నిండి ఉన్న బెల్లాన్ని తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయని వెల్లడిస్తున్నారు. దీని వల్ల బీపీని అదుపు చేయడం, శరీరానికి తక్షణ శక్తిని అందించడం, నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం కలిగించడం, రక్తహీనతను తగ్గుతుందని వివరిస్తున్నారు.

### బెల్లం నెయ్యి

ఈ రెండూ కలిపి తీసుకుంటే మలబద్ధకం సమస్య నుంచి విముక్తి పొందచ్చు. బెల్లంంధని యాలు: ఇలా తీసుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, నొప్పుల నుంచి విముక్తి పొందచ్చు. ఇంకా స్పాటింగ్ మాత్రమే అవుతోందని బాధపడే వారికి ఆ సమస్య తగ్గి ఎప్పటిలాగే పిరియడ్స్ ప్రారంభమవుతాయట.

### బెల్లం సోంపు

ఇది నోటి దుర్వాసనను దూరం చేస్తుంది. అంతేకాకుండా దంతాలపై పాచి పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

### బెల్లం మెంతులు

ఇలా రెండు కలిపి తీసుకుంటే జుట్టు ఆరోగ్యం రెట్టింపు అవుతుంది. కుదుళ్లు దృఢంగా మారడమే కాకుండా.. తెల్ల జుట్టు రాకుండా జాగ్రత్తపడచ్చు.

### బెల్లం గోంద్

ఎముకల్ని దృఢంగా చేయడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ చక్కగా ఉపకరిస్తుందని నిపుణులు అంటున్నార. అలాగే పాలిచ్చే తల్లులు తీసుకుంటే చనుబాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు.

### బెల్లం అలీవ్ గింజలు

మనం తీసుకునే ఆహారంలోని ఫోలికామ్లం, ఐరన్‌ను శరీరం త్వరగా గ్రహించేందుకు ఈ ఫుడ్ కాంబినేషన్ తోడ్పడుతుందని తెలిపారు. ఇక చర్మంపై ఏర్పడిన పిగ్మెంటేషన్‌ని తగ్గించడంతో పాటు జుట్టు పెరుగుదలకూ దోహదం చేస్తుందని వివరించారు.

### బెల్లం నువ్వులు

ఈ రెండింటిని కలిపి తినడం వల్ల దగ్గు, జలుబు, ఫ్లూ వంటివి దరిచేరకుండా కాపాడుతుంది.

### బెల్లంపల్లీలు

శరీరంలో సత్తువను పెంచడానికి, ఆకలిని అదుపు చేయడానికి, ఆహారపు కోరికల్ని తగ్గించడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ అద్భుతంగా పని చేస్తుందని నిపుణులు అంటున్నారు.

బెల్లంంపసుపు: ఈ రెండూ కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెబుతున్నారు.

బెల్లంంశొంఠి పొడి: వీటిని కలిపి తినడం వల్ల జ్వరం నుంచి త్వరగా కోలుకోవచ్చు. ఇంకా శరీరంలోని వాపును తగ్గించడానికి ఇది దోహదం చేస్తుంది.

# ‘ఇవి తింటే యూరిక్ యాసిడ్ తగ్గిపోతుంది’

**బెస్ట్ రిజల్ట్స్ కోసం ఎప్పుడు తినాలి ?**

**ఈ 6 పదార్థాలు తీసుకుంటే యూరిక్ యాసిడ్ తగ్గతుందట!**

**ఎలా తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయో తెలుసా ?**

**కబురు న్యూస్, ఆరోగ్యం, ఆగస్టు 8** ఈ మధ్య కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ పెరగడం వల్ల నొప్పితో పాటు గౌట్, కిడ్నీలో రాళ్లు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో అనేక మందులతో పాటు ఆహార నియమాలు పాటిస్తుంటారు. అయితే కొన్ని డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు.. యూరిక్ యాసిడ్ స్థాయులను తగ్గేలా చేస్తాయని వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటి వాటిని ఎప్పుడు, ఎలా తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.యూరిక్ యాసిడ్ఎలా ఏర్పడుతుంది.మనం రోజూ తీసుకునే ఆహారంలోని ప్రొటీన్ల నుంచి ప్యూరిన్ అనే రసాయనం విచ్ఛిన్నం చెంది యూరిక్ యాసిడ్‌గా ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన యూరిక్ యాసిడ్ ఎప్పటికప్పుడూ మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. కానీ కొన్ని సందర్భాల్లో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉత్పత్తి కాగా, అంతే స్థాయిలో మూత్రం ద్వారా సరిగ్గా బయటకు వెళ్లనప్పుడు సమస్య వస్తుంది. యూరిక్ యాసిడ్ విసర్జన సరిగ్గా జరగక అది రక్తంలోని నిలిచిపోతుంది. అలా నిలిచిపోయిన యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోయి హైపర్? యూరిసిమియాకు దారి తీస్తుంది.



**వాల్ నట్స్ :** ఇందులో పుష్కలంగా ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ వాపు, నొప్పిని తగ్గించడంలో బాగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంకా యూరిక్ యాసిడ్‌ను తొలగించి కిడ్నీ పనితీరును మెరుగపరచడంలోనూ సాయపడుతుందని వెల్లడిస్తున్నారు.2-3 వాల్ నట్స్‌ను ముందు రోజు రాత్రి నీటిలో నానబెట్టాలి. అనంతరం పరగడుపునే తినవచ్చని లేదా స్మూతీలు, సలాడ్?తో పాటు తీసుకోవాలని చెబుతున్నారు.

**పిస్తా :** పిస్తాల్లో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు గుణాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఇవి యూరిక్ యాసిడ్, వాపు పెరిగేందుకు కారణమైన ఆక్సిడేటివ్ స్ట్రెస్‌తో పోరాడుతుందని వివరిస్తున్నారు. ఇంకా ఇందులోని ఆరోగ్యకరమైన పోషకాలు జీర్ణక్రియను మెరుగపరచడంలో సాయపడతాయని తెలిపారు.సుమారు 15 పిస్తాలను ఉదయాన్నే తినాలని చెబుతున్నారు. అయితే, వీటిని వేయించకుండా, ఎలాంటి ఉప్పు లేకుండా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉప్పుతో తీసుకుంటే కిడ్నీ పనితీరుపై చెడు ప్రభావం చూపిస్తుందని తెలిపారు.

**బాదం :** బాదంలో జీర్ణక్రియను పెంచే, యూరిక్ యాసిడ్ లెవల్స్‌ను అదుపులో పెట్టే మెగ్నీషియం పోషకాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును పెంచుతుందని వివరిస్తున్నారు.5-6 బాదంను రాత్రి పూట నీటిలో నానబెట్టి ఉదయాన్నే వాటి పొట్టును తీసి ఖాళీ కడుపుతో తినాలని చెబుతున్నారు. అలా తినలేకపోతే మిక్సీ పట్టి పాలల్లో లేదా ఓట్ మీల్‌లో కలిపి తాగాలని అంటున్నారు.

**జీడిపప్పు :** మెగ్నీషియంతో పాటు హెల్దీ ఫ్యాట్ లభించే అద్భుతమైన పదార్థాల్లో జీడిపప్పు ఒకటి. ఇవి వాపును తగ్గించడంతో పాటు జీర్ణక్రియను పెంచడంలో సహాయ పడతాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇందులో ప్యూరిన్స్ తక్కువగా ఉండడం వల్ల యూరిక్ యాసిడ్ అదుపులో ఉంటుందని వివరిస్తున్నారు. ఉదయాన్నే 4-5 జీడిపప్పులను ఎలాంటి ఉప్పు లేకుండానే తినాలని చెబుతున్నారు. వీలైతే ఇతర నట్స్‌తో తీసుకుంటే సమతుల పోషకాలు అందుతాయని తెలిపారు.

**డేట్స్ (ఖర్జూర) :** ఇందులో ఫైబర్, పొటాషియం లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రెండూ యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును మెరుగుపరుస్తాయని అంటున్నారు. ఇంకా సహజంగానే శక్తిని పెంచేలా చేస్తుందని వివరిస్తున్నారు.ఉదయాన్నే 1-2 డేట్స్ నేరుగానే తినాలని లేదా స్మూతీలు, సలాడ్‌లో కలిపి తీసుకోవచ్చని చెబుతున్నారు.

**బ్రెజిల్ నట్స్ :** ఇందులో వాపును తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్న సెలీనియం పుష్కలంగా ఉంటుందని తెలిపారు. ఇంకా ఇది యూరిక్ యాసిడ్?ను బయటకు పంపి కిడ్నీలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుందని వివరిస్తున్నారు.రోజూ 1-2 బ్రెజిల్ నట్స్ తినాలని.. అతిగా తింటే సెలీనియం శరీరానికి హానికరమని అంటున్నారు. ఉదయాన్నే నేరుగా లేకపోతే గ్రైండ్ చేసి తీసుకోవచ్చని చెబుతున్నారు.ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# షుగర్ పేషెంట్లు ఈ 6 పండ్లను అసలు తినకూడదట!

**గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువుంటే షుగర్ లెవల్స్ పెరుగుతాయట!**

**ఇవి ఎక్కువగా ఉండే పండ్లు**

**కబురు న్యూస్, ఆరోగ్యం, ఆగస్టు 8** ప్రతి రోజు పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. కానీ, మధుమేహంతో బాధపడే వారు మాత్రం పండ్లు తినాలంటే భయపడుతుంటారు. పండ్లలో చక్కెరస్థాయి ఎక్కువగా ఉంటుందని.. వాటిని తింటే రక్తంలో షుగర్ స్థాయులు పెరుగుతాయని భయపడుతుంటారు. ముఖ్యంగా కొన్ని పండ్లను తీసుకుంటే మాత్రం చక్కెర స్థాయులు పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2002లో  అనే అధ్యయనంలోనూ ఈ విషయం తేలింది. ఈ నేపథ్యంలోనే ఆ పండ్లు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.



మనం రోజూ తీసుకునే ఆహారంలో ఉండే కార్బోహైడ్రేట్స్ వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు పెరుగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా రక్తంలో చక్కెర స్థాయి ఎంత మేర పెరుగుతుందో తెలిపే కొలమానాన్నే గ్లైసెమిక్ ఇండెక్స్ అంటుంటారు. తీసుకునే ఆహారంలో చక్కెర స్థాయి 55కు మించకుండా ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ అని, 56-69 మధ్య ఉంటే మధ్యస్థ, 70కి మించి ఉంటే అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌గా విభజిస్తుంటారు. అయితే, మధుమేహం ఉన్నవారు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తినాలని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తక్కువగా తింటే మంచిదని సలహా ఇస్తున్నారు. (రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్ చేయండి)

**పుచ్చకాయ :** వేసవిలో వచ్చే పుచ్చకాయలో అనేక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ఇందులో 72-80 వరకు గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని.. ఫలితంగా ఎక్కువ షుగర్ స్థాయులు ఉంటాయని తెలిపారు. అందుకే దీనిని వీలైనంత తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**అరటి:** సీజన్?తో సంబంధం లేకుండా ఉండే అరటిలో పండిన శాతం ఆధారంగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని వెల్లడిస్తున్నారు. అరటి కాయలో 42-62 వరకు ఉంటుందని.. పండిన తర్వాత ఇంకా ఎక్కువగానే ఉంటుందని వివరిస్తున్నారు. అందుకే వీటిని తక్కువగా తినాలని సూచిస్తున్నారు.

**పైనాపిల్:** ఇందులో సహజసిద్ధమైన చక్కెరలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఫలితంగా ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయని వెల్లడిస్తున్నారు. అందుకే తక్కువ మోతాదులో తినాలని సూచిస్తున్నారు.

**మామిడికాయ:** వేసవిలో మాత్రమే లభించే మామిడికాయ అంటే చాలా మందికి ఎంతో ఇష్టం ఉంటుంది. దీంతో ఎక్కువగా తింటుంటారు. ఇందులో 51-60 గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని, ఫ్రక్టోజ్, సూక్రోజ్ శాతం సైతం అధికంగా ఉంటుందని చెబుతున్నారు. చక్కెర స్థాయులు పెరగకుండా ఉండాలంటే దీనిని తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**ద్రాక్ష:** ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగానే ఉంటుందని.. కానీ చిన్నగా ఉండడం వల్ల ఎక్కువగా తీసుకుంటామని అంటున్నారు. ఫలితంగా చక్కెర స్థాయులు పెరుగుతాయని చెబుతు న్నారు. అందుకే వీలైనంత తక్కువగా ద్రాక్షను తినాలని సూచిస్తున్నారు.

**చెర్రీలు:** చెర్రీల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయులు రకరకాలుగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీలైనంత తక్కువగా తినాలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచ నలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## ఇవి తింటే స్ట్రోక్ వచ్చే ఛాన్స్ తక్కువట



**కబురు న్యూస్, ఆరోగ్యం, ఆగస్టు 8** మీకు 30 ఏళ్లు దాటాయా? అయితే మీరు తినే ఆహారంలో ఈ పదార్థాలు చేర్చుకుంటే మంచిదట! వీటిని మీ డైట్?లో జతచేసుకోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువని నిపుణులు చెబుతున్నారు. మన జీర్ణవ్యవస్థకు మెదడు ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉందని 18వ శతాబ్దంలోనే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ నేపథ్యంలోనే వాటిపైన మరింత అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా.. మెదడు ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో పరిశీలించారు. ఇందులో శరీరంలోని రెండు ప్రధాన భాగాలైన జీర్ణవాహిక, కేంద్ర నాడీ వ్యవస్థ మధ్య పరస్పర కమ్యూనికేషన్ జరిగినట్లు తేల్చారు. ప్రోబయాటిక్స్ గుణాలున్న ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండి మెదడును రక్షిస్తుందని వెల్లడించారు.మరోవైపు జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా సంఖ్య పెరగడం వల్ల దీర్ఘకాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. 2025లో అనే అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలోనే జీర్ణవ్యవస్థ, మెదడు మధ్య ఉన్న సంబంధంపై చైనాకు చెందిన ఫుడాన్ యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేష్ సర్వేలోని డేటాను సేకరించి పరిశీలించారు. ఇందులో 20ఏళ్లు దాటిన వివిధ ప్రాంతాలు, వివిధ ఆహారపు అలవాట్లు ఉన్న 48,677 మంది వివరాలు సేకరించారు. వీరికి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంచే అవకాడోలు, బ్రకోలీ, కాఫీ, శనగలు, క్రాన్?బెర్రీలు, డెయిరీ పదార్థాలు, సోయా, తృణధాన్యాలు ఆధారంగా ఎక్కువ స్కోర్లు ఇచ్చారు. దీంతో పాటు ప్రాసెస్ చేసిన ఆహారం, మాంసం తీసుకున్నవారికి తక్కువ స్కోర్లు ఇచ్చి విభజించారు. ఇందులో 20-29 ఏళ్ల మధ్య ఉన్నవారిలో ఎలాంటి మార్పులను గమనించలేదని పరిశోధకులు వెల్లడించారు. అదే 30 ఏళ్లు దాటినవారిలో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటే.. స్ట్రోక్ వచ్చే అవకాశం తగ్గినట్లు కనిపెట్టారు. ముఖ్యంగా ఆకుకూరలు, వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారం తినేవారిలో స్ట్రోక్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం తక్కువని తెలిపారు.మరోవైపు జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా లేకపోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని 2022లో అధ్యయనంలో తేలింది. జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవుల సమతుల్యంగా లేకపోవడం వల్ల హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఊబకాయం, జీర్ణక్రియ సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇవన్నీ దీర్ఘకాలంలో స్ట్రోక్?కు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. అధిక రక్తపోటు, అధిక చక్కెర స్థాయుల, జీర్ణక్రియ సమస్యల వల్ల మెదడులో రక్తం గడ్డకట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

## రోజూ ఇవి వాడితే కిడ్నీలు ఫెయిల్ అయ్యే ఛాన్స్

**పెయిన్ కిల్లర్స్ అతిగా వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్**

**కిడ్నీలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలివే**



**కబురు న్యూస్, ఆరోగ్యం, ఆగస్టు 8** మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. ఆహారం జీర్ణమయ్యే సమయంలో ఏర్పడే మలినాలు, శరీరంలో జరిగే జీవక్రియలో ఏర్పడే వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడూ తొలగించి ఆరోగ్యంగా ఉండేలా కిడ్నీలు సాయంచేస్తాయి. అయితే, ఇటీవల కాలంలో అనేక కారణాల వల్ల చాలా మంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి కారణం సరైన ఆహారం తీసుకోకపోవడం, అధిక రక్తపోటు అని చాలా మంది అనుకుంటారు. కానీ, రోజూవారీ జీవితంలో ఉపయోగించే కొన్ని వస్తువుల వల్ల కూడా మన మూత్ర పిండాలు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.ఫెయిర్ నెస్ క్రీమలు: చాలా మంది ఉపయోగించే ఫెయిర్ నెస్ క్రీముల వల్ల కిడ్నీలు దెబ్బతింటాయని నిపుణులు అంటున్నారు. ఇందులో మెలనిన్ ఉత్పత్తిని అడ్డుకునేందుకు వాడే హానికారక మెర్క్యురీ అధికంగా ఉంటుందని.. దీనిని చర్మం గ్రహించడం వల్ల శరీరంలోకి చేరి కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం పాటు మెర్క్యురీతో కూడిన సౌందర్య ఉత్పత్తులను వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకోసమే ఇలాంటి ఉత్పత్తులు కొనేముందు అందులోని పదార్థాలను చూడాలని.. అవసరమైతే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు.

**హెర్బల్ సప్లిమెంట్లు :** హెర్బల్ సప్లిమెంట్లను పార్మా మందులకు ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు చాలా మంది. అయితే, వీటిపై నేచురల్, హెర్బల్ అని పెట్టినా సరే.. సరిగ్గా పరీక్షించకపోవడం వల్ల కొన్ని ఉత్పత్తుల్లో హానికారక రసాయనాలు కలిపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఆర్సనిక్, లెడ్, మెర్క్యురీ వంటి విషపూరిత పదార్థాలను వాడడం వల్ల అవి శరీరంలో పేరుకుపోయి కిడ్నీలను దెబ్బతీస్తాయని తెలిపారు. అందుకే హెర్బల్ ఉత్పత్తులను వాడే ముందు డాక్టర్లను సంప్రదించాలని.. మంచి పేరున్న బ్రాండ్ ఉత్పత్తులను వాడాలని సూచిస్తున్నారు.

**పెయిన్ కిల్లర్స్ :** మనలో చాలా మంది తల, కండరాల నొప్పులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా షాపునకు వెళ్లి పెయిన్ కిల్లర్స్ తీసుకుంటారు. అయితే, ఈ మందులు స్వల్పకాలం నొప్పిని తగ్గించినా.. దీర్ఘకాలంలో అనేక ఇబ్బందులను తెస్తాయని నిపుణులు వెల్లడించారు. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వీటిని తరచూగా తీసుకోవడం వల్ల కిడ్నీలకు రక్త సరఫరాను తగ్గి ఫలితంగా కిడ్నీలు ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**గ్రీన్ టీ :** ప్రపంచంలోనే ఆరోగ్యకరమైన పానీయాల్లో గ్రీన్ టీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటుంటారు. కానీ, గ్రీన్ టీని ఎక్కువగా తాగడం వల్ల (రోజుకు అర లీటర్ కంటే ఎక్కువ) కిడ్నీలు ఫెయిల్ అవుతాయని మీకు తెలుసా? ఇందులో ఉండే ఆక్సలెట్స్.. క్యాల్షియంతో కలిసి కిడ్నీలో రాళ్లు ఏర్పడేలా చేస్తాయని వెల్లడించారు. అలా అని మొత్తంగా గ్రీన్ టీని మానేయాల్సిన అవసరం లేదని.. కానీ ఎక్కువ మోతాదులో తీసుకోకూడదని సూచిస్తున్నారు. మీకు ఇప్పటికే కిడ్నీలో రాళ్ల సమస్య ఉంటే తక్కువ మోతాదులో తాగాలని సలహా ఇస్తున్నారు.

**ప్రొటీన్ సప్లిమెంట్లు :** పోషకాహార లోపం ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు వ్యాయామంలో భాగంగా ప్రొటీన్ సప్లిమెంట్లను తీసుకుంటారు. కండరాలు పెరగడానికి చాలా మంది పౌడర్లు, షేక్స్ తీసుకుంటారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. మనం తీసుకునే ప్రొటీన్లను ఫిల్టర్ చేసే బాధ్యత కిడ్నీలపై ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల వాటిని ఫిల్టర్ చేయలేక కిడ్నీపై ఒత్తిడి పెరిగి సమస్యలు వస్తాయని వివరించారు. అందుకే వీటిని మరీ ఎక్కువగా కాకుండా.. తగిన మోతాదులో తీసుకోవాలని అవసరమైతే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.హెయిర్ స్ట్రెయిటెనింగ్ ఉత్పత్తులు: కొంతమంది తరచూగా హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుంకుంటారు. ఇందుకోసం మార్కెట్లో దొరికే కొన్ని ఉత్పత్తులను వాడుతుంటారు. అయితే, ఇందులో ఉండే గ్లైయాక్లాలిక్ యాసిడ్ చర్మం ద్వారా శరీరంలోకి చేరి కిడ్నీలను దెబ్బ తీస్తాయని వెల్లడిస్తున్నారు.



తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY



# బెస్ట్ 'లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ' ఎలా కొనుగోలు చేయాలి

**ఈ టిప్స్ హెల్ప్ అవుతాయట!**

**అత్యుత్తమ పాలసీతో కుటుంబ భవిష్యత్తు గురించి ఆందోళన చెందకుండా ఉండొచ్చంటున్న నిపుణులు**

**బీమా కొనుగోలు చేసేటప్పుడు ఈ విషయాలు పరిగణనలోకి తీసుకోవాలట!**




**కబురు న్యూస్, బిజినెస్, ఆగస్టు 8 :** ఎప్పుడు, ఏం జరుగుతుందో తెలియని ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక భరోసాను కలిగి ఉండటం తప్పనిసరి. లైఫ్ ఇన్సూరెన్స్ దీనిని అందిస్తుంది. అయితే జీవిత బీమా పాలసీని కొనుగోలు చేసేటప్పుడు, అది అత్యుత్తమ పథకం అని నిర్ధారించుకోవడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. సరైన బీమా, సరైన కాలపరిమితితో కూడిన అత్యుత్తమ జీవిత బీమా పాలసీని కలిగి ఉండడం వల్ల కుటుంబ భవిష్యత్తు గురించి ఆందోళన చెందకుండా ఉండొచ్చంటున్నారు. ఈ క్రమంలోనే బీమా పాలసీని కొనుగోలు చేసేటప్పుడు కొన్ని ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.కుటుంబానికి కవర్: జీవిత బీమా పాలసీ.. సంపాదించే వ్యక్తి పేరుపై ఉన్నప్పటికీ, పాలసీ ఉపయోగపడేది అతని కుటుంబానికి అన్న విషయం మరువకూడదు. కాబట్టి, కుటుంబానికి తగిన ఆర్థిక భద్రతను కల్పించాలనుకుంటే, వారికి అవసరమయ్యే మొత్తాన్ని, అంటే ఇంటి ఖర్చుల నుంచి మొదలై కుటుంబ భవిష్యత్తుకు సంబంధించిన ఆర్థిక లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. ఉదాహరణకు.. భవిష్యత్ ఇంటి ఖర్చులు, జీవనశైలి ఖర్చులు, పిల్లల విద్య/వివాహాలు మొదలగు అన్ని ఖర్చులకు తగ్గట్టుగా బీమా ప్లాను కలిగి ఉండాలంటున్నారు.నేటి అత్యుత్తమ జీవిత బీమా పథకాలు, జీవితంలోని కీలక దశల్లో లైఫ్ కవర్‌ను పెంచుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయంటున్నారు. ఈ క్రమంలోనే అవసరాన్ని బట్టి, ప్రతీ సంవత్సరం 5 శాతం చొప్పున పెరిగే లైఫ్ కవర్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చంటున్నారు. లక్ష్యాలు ఒక్కొక్కరికి ఒక్కోలా ఉండవచ్చని. తగిన జీవిత బీమా పాలసీ ద్వారా లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళిక వేసుకోవాలంటున్నారు. కుటుంబ ఆర్థిక భద్రతను కాపాడుకోవడం ప్రధాన లక్ష్యమైతే, తక్కువ ఖర్చుతో అధిక బీమా రక్షణను అందించే 'టర్మ్ ఇన్సూరెన్స్' పథకాన్ని ఎంచుకోవడం మంచిదంటున్నారు.ఆర్థిక స్థితి: ఏ కంపెనీ నుంచి జీవిత బీమా కొనుగోలు చేయాలనుకుంటున్నారో ఆ సంస్థకు సంబంధించిన ఆర్థిక స్థితిగతులను పరిశీలించడం చాలా అవసరం అంటున్నారు నిపుణులు. ఒక బీమా సంస్థకు సంబంధించిన ఆర్థిక స్థితి అనేది దాని గత పనితీరు గురించి చెప్పడమే కాకుండా, భవిష్యత్తు అంచనాలకు కూడా ఒక సూచికగా ఉంటుందంటున్నారు. బీమా సంస్థ విడుదల చేసే ఆర్థిక నివేదికలు.. పెట్టుబడిదారులు, పరిశ్రమ నిపుణులు, వినియోగదారులు, మీడియాతో సహా వివిధ వాటాదారులకు అత్యంత ముఖ్యమైనవంటున్నారు. అయితే ఆర్థిక నివేదికలలో ఉండే సాంకేతిక పరిభాషపై మీకు పూర్తి అవగాహన లేకపోయినా, విశ్లేషకులు, పరిశ్రమ నిపుణుల నివేదికలు లేదా ప్రకటనలను చూడడం ద్వారా ఆ జీవిత బీమా కంపెనీ ఆర్థిక స్థితిగతులు పరిగణించదగినవిగా ఉన్నాయో లేదో అర్థం చేసుకోవచ్చంటున్నారు.సంస్థ చరిత్ర: ఒక బీమా సంస్థ చరిత్రను బట్టి ఆ కంపెనీ బీమా పాలసీతో సంబంధం పెట్టుకోవాలా వద్దా అని నిర్ణయించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఆ సంస్థ ఎంతకాలంగా వ్యాపారంలో ఉంది, కాలక్రమేణా దానికున్న పేరు ప్రతిష్టలు ఏంటి అనేవి చాలా ముఖ్యమంటున్నారు. దేశంలోని అగ్రశ్రేణి జీవిత బీమా కంపెనీలలో ఒకటిగా దాన్ని పరిగణించవచ్చా, లేదా అని తెలుసుకోవాలని, ఆ సంస్థ నిర్వహణలో ఉన్న ప్రారంభం నుంచి ఇప్పటి దాకా దాని పనితీరు ఎలా ఉంది అనే విషయాలను పరిశీలించమంటున్నారు. కొత్తగా ఏర్పాటైన బీమా సంస్థ విషయంలో, దాని నేపథ్యాన్ని, కార్యకలాపాలను, భవిష్యత్తు పనితీరును పరిశీలించడం మేలని వివరిస్తున్నారు.సంస్థ నెట్‌వర్క్: లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకునేటప్పుడు ఒక బీమా సంస్థ శాఖ భౌతికంగా నివాసానికి ఎంత దగ్గరగా ఉంది, అంటే అందుబాటులో ఉందో, లేదో అనేది పరిగణించాల్సిన ఒక ముఖ్యమైన అంశం అంటున్నారు. విస్తృతమైన శాఖలు, భౌతిక కార్యాలయాల నెట్‌వర్క్ ఉన్నట్లయితే.. వినియోగదారులు ఏవైనా పాలసీ లావాదేవీలు జరపవలసి వచ్చినప్పుడు సంస్థ శాఖకు సులభంగా చేరుకోవచ్చని వివరిస్తున్నారు.

పాలసీ తీసుకునేముందు బీమా సంస్థకు చెందిన క్లెయిం సెటిల్‌మెంట్ రేషియోను తప్పనిసరిగా చూడాలని చెబుతున్నారు. ఇది, ఒక బీమా కంపెనీకి అందిన క్లెయింలతో పోలిస్తే, గత సంవత్సరంలో ఆ కంపెనీ విజయవంతంగా పరిష్కరించిన క్లెయింల సంఖ్యను సూచించే విలువ అంటున్నారు. భారత్‌లో 95 నుంచి 99% అధిక క్లెయిం సెటిల్‌మెంట్ నిష్పత్తిని కలిగి ఉండే బీమా సంస్థలున్నాయని, వీటిలో సరైనదాన్ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. వివిధ బీమా సంస్థల తాజా వివరాలను చూడడానికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చంటున్నారు. వినియోగదారుల రివ్యూలను చదివి, జీవిత బీమా సంస్థకు సంబంధించిన క్లెయిం సేవ వేగంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందో లేదో తెలుసుకోవడం మంచిదంటున్నారు.

# ఆర్బీఐ కీలక నిర్ణయం- వడ్డీ రేట్లు యథాతథం

**వరుసగా నాలుగోసారి**

**ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటన**

**కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన ఆర్‌బీఐ**




**కబురు న్యూస్, బిజినెస్, ఆగస్టు 8 :**అంచనాలకు అనుగుణంగానే భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా కొనసాగిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. దేశ ఆర్థిక వ్యవస్థ ముందున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ప్రకటించారు. రెపో రేటును 5.25 శాతం వద్దనే కొనసాగించాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇలా వడ్డీరేట్లు యాథతథంగా ఉంచడం వరుసగా ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఆర్‌బీఐ తన బెంచ్‌మార్క్ లెండింగ్ రేటును మార్చకుండా ఉంచడంతోపాటు, ఆర్‌బీఐ స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును కూడా 5 శాతం వద్దనే కొనసాగించింది. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటును, బ్యాంక్ రేటును కూడా ఎలాంటి మార్పులు లేకుండా 5.5 శాతం వద్దే స్థిరంగా ఉంటుంది.ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడుతోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దేశంలో చమురు, ఆహార ధరల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతోందని చెప్పారు. మూడో త్రైమాసికం (క్యూ3)లో ద్రవ్యోల్బణం గరిష్ఠానికి చేరి, తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "జులై మొదటి వారం నుంచి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రం కావడంతో ఇంధన ధరల్లో తీవ్ర అస్థిరత కొనసాగుతోంది. అయితే మొదటి త్రైమాసికానికి (క్యూ1) సంబంధించి కార్పొరేట్ సంస్థల ముందస్తు ఫలితాలు మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో మంచి పనితీరును సూచిస్తున్నాయి. విచక్షణతో కూడిన వ్యయాలు (డిస్క్రిషనరీ స్పెండింగ్) పుంజుకోవడం వల్ల ప్రైవేట్ వినియోగం నిరంతరాయంగా సాగుతోంది. మొత్తంగా చూస్తే, భారత ఆర్థిక వ్యవస్థ మొదటి త్రైమాసికంలో అంచనాల కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచింది" అని మల్హోత్రా పేర్కొన్నారు.కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 4.38 శాతంగా నమోదైంది. ఇది ఆర్‌బీఐ మధ్యకాలిక లక్ష్యమైన 4 శాతం పరిమితిని దాటింది. అయినప్పటికీ కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్ల పెంచకపోవడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరానికి సీపీఐ ద్రవ్యోల్బణం 5 శాతం ఉండవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఇది అంతకు ముందు అంచనా వేసిన 5.1 శాతం కంటే 10 బేసిస్ పాయింట్లు తక్కువ కావడం గమనార్హం. మొదటి త్రైమాసికం ద్రవ్యోల్బణం అంచనాను 4.2 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గించగా, రెండో త్రైమాసికం అంచనాను 5.1 శాతం నుంచి 4.7 శాతానికి తగ్గించింది. మూడో త్రైమాసికం అంచనాను 5.9 శాతం వద్దే కొనసాగించిన ఆర్‌బీఐ, నాల్గో త్రైమాసికం అంచనాను మాత్రం 5.4 శాతం నుంచి 5.5 శాతానికి పెంచింది.ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను 6.6 శాతం నుంచి 6.7 శాతానికి పెంచింది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (క్యూ1 ఎఫ్‌వై27) జీడీపీ వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 7 శాతానికి, రెండో త్రైమాసికం (క్యూ2) అంచనాను 6.3 శాతం నుంచి 6.4 శాతానికి పెంచింది. కేంద్ర బ్యాంకు మూడో త్రైమాసికం (క్యూ3) అంచనాను 6.8 శాతం వద్దే కొనసాగించింది. దీనిని బట్టి ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలో కూడా ఆర్థిక వృద్ధి వేగం స్థిరంగా ఉంటుందని ఆర్‌బీఐ భావిస్తోంది.మరోవైపు, ఈ ఏడాది ప్రారంభం నుంచి రూపాయి విలువ నిరంతరంగా క్షీణిస్తూ వస్తోంది. ప్రస్తుతం అమెరికన్ డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ, డాలర్‌కు రూ.95 నుంచి రూ.96 మధ్య కదలాడుతోంది. ఒకప్పుడు ఆసియాలోనే అత్యంత స్థిరమైన కరెన్సీలలో ఒకటిగా రూపాయి ఉండేది. కానీ ముడిచమురు ధరలు పెరగడం, పెట్టుబడుల ఉపసంహరణ, పెరుగుతున్న వాణిజ్య లోటు, బలపడుతున్న అమెరికన్ డాలర్ వంటి కారణాలతో, మన రూపాయి విలువ బాగా క్షీణించింది. ముఖ్యంగా ఈ ఏడాది అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో అత్యంత పేలవమైన ప్రదర్శన కనబరిచిన కరెన్సీలలో ఒకటిగా రూపాయి నిలిచింది. ఈ 2026 సంవత్సరంలో రూపాయి విలువ ఇప్పటి వరకు దాదాపు 7 శాతం మేర క్షీణించగా, ఫిబ్రవరి చివరిలో ఇరాన్ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 6 శాతం మేర పతనమైంది.

# ఐటీ రిటర్న్స్‌లో తప్పులు ఉన్నాయా

**ఇలా ఈజీగా సరిదిద్దుకోవచ్చు!**

**ముగిసిన 2026-27 అసెస్మెంట్ ఇయర్ ఐటీఆర్ ఫైలింగ్ గడువు**

**అయితే తప్పులు ఉంటే ఆందోళన చెందకుండా ఇవి ఫాలో అయితే సరిపోతుందని నిపుణులు సూచన!**




**కబురు న్యూస్, బిజినెస్, ఆగస్టు 8 :**సాధారణ వేతన జీవులు, ఆడిటింగ్ అవసరం లేని ట్యాక్స్ పేయర్స్ 2026-27 అసెస్మెంట్ సంవత్సరానికి సంబంధించి ఐటీఆర్ దాఖలు చేసేందుకు గడువు ముగిసింది. ఇప్పటివరకూ 5.9 కోట్లకు పైగా రిటర్నులు దాఖలైనట్లు ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖ వెల్లడించింది. అయితే ఐటీఆర్ ఫైల్ చేసేందుకు గడువు ముగిసిన తర్వాత చాలా మందిలో "నేను రిటర్నులు దాఖలు చేయడం మర్చిపోయాను, ఇప్పుడు పరిస్థితి ఏమిటి", లేదా "రిటర్న్ వేశాను కానీ, అందులో కొన్ని తప్పులు దొర్లాయి. ఇప్పుడు వాటిని సరిదిద్దుకోవచ్చా" అనే సందేహాలు తలెత్తుతాయి. అయితే పన్ను నిబంధనల ప్రకారం వీటికి స్పష్టమైన పరిష్కారాలు ఉన్నాయం టున్నారు నిపుణులు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.రిటర్నులు దాఖలు చేసిన తర్వాత చాలా మంది తమ వ్యక్తిగత వివరాల్లో పొరపాట్లు జరగడం, ఏదైనా ఆదాయ వనరును వెల్లడించకపోవడం, లేదా క్లెయిం చేయని మినహాయింపుల గురించి ఆలస్యంగా గుర్తిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఆందోళన చెందకుండా సెక్షన్ 139(5) కింద "రివైజ్డ్ రిటర్న్" దాఖలు చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి, ఈ సవరించిన రిటర్నులను 2026 డిసెంబరు 31 వరకూ లేదా ఐటీ శాఖ మదింపు ప్రక్రియను పూర్తి చేసే లోపు (ఏది ముందైతే అది) సమర్పించే వెసులుబాటు ఉందంటున్నారు. ఒకసారి రివైజ్డ్ రిటర్న్ దాఖలు చేస్తే, అది పాత రిటర్న్ స్థానాన్ని భర్తీ చేస్తుందని, గడువులోపు ఎన్నిసార్లయినా దీనిని అప్‌డేట్ చేసుకోవచ్చని వివరిస్తున్నారు.ఒకవేళ జులై 31 లోపు అసలు రిటర్నే దాఖలు చేయకపోతే, ఇప్పటికీ అవకాశం ఉందంటున్నారు నిపుణులు. దీనినే "బిలేటెడ్ రిటర్న్" అంటారు. దీనిని డిసెంబరు 31లోగా సమర్పించాలని, గడువు పూర్తైన తర్వాత ఫైల్ చేస్తున్నారు కాబట్టి, సెక్షన్ 234ఎఫ్ కింద జరిమానా, అలాగే పన్ను బాకీపై వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ డిసెంబరు 31 గడువూ ముగిస్తే, కేవలం అదనపు ఆదాయాన్ని వెల్లడించేందుకు మాత్రమే సెక్షన్ 139(8ఏ) కింద "అప్‌డేటెడ్ రిటర్న్" దాఖలు చేసేందుకు వీలుంటుందంటున్నారు. అయితే దీని ద్వారా అదనపు మినహాయింపులు కోరడం, రీఫండ్‌ను పెంచుకోవడం సాధ్యం కాదని వెల్లడిస్తున్నారు.ఇటీవలి కాలంలో ఆదాయపు పన్ను శాఖ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అధునాతన డేటా అనలిటిక్స్‌ను విస్తృతంగా వాడుతోందని, దీనివల్ల రిటర్నుల్లో చిన్నపాటి వ్యత్యాసం వచ్చినా ఆదాయపు పన్ను శాఖ వ్యవస్థలు వెంటనే గుర్తుపడుతున్నా యంటున్నారు. ముఖ్యంగా భారీ రీఫండ్ క్లెయిమ్ చేసిన కేసులను ఐటీ శాఖ అత్యంత నిశితంగా పరిశీలిస్తోందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో దాఖలు చేసే సమాచారానికి, ఐటీ శాఖ వద్ద ఉండే వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్), ట్యాక్స్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (టీఐఎస్) మధ్య తేడాలుంటే నోటీసులు రావడం ఖాయమంటున్నారు అదే విధంగా, సేవింగ్స్ అకౌంట్ వడ్డీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, డివిడెండ్ ఆదాయం లేదా ఆన్‌లైన్ గేమింగ్ లాభాలను విస్మరిస్తే, నోటీసులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అలాగే క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులు రూ.10లక్షలు దాటినా, ఆస్తుల కొనుగోలు రూ.30లక్షలకు మించినా ఆ వివరాలు ఎస్ఎఫ్‌టీ ద్వారా ఐటీ శాఖకు చేరుతాయని, ఇక్కడ ఆదాయానికీ, ఖర్చుకూ పొంతన లేకపోయినా సమస్యలు తప్పవంటున్నారు.పన్ను చెల్లింపుదారులు తాము చెల్లించాల్సిన అసలు పన్నుకంటే ఎక్కువ మొత్తాన్ని చెలించినప్పుడు రీఫండ్‌కు అర్హత ఉంటుందంటున్నారు. సాధారణంగా ఐటీఆర్‌ను విజయవంతంగా ఇ-వెరిఫై చేసినప్పటి నుంచే ప్రాసెసింగ్ ప్రారంభమవుతుం దంటున్నారు. కేవలం వేతన ఆదాయం ఉండి, వివరాలన్నీ ఫారం-16, ఏఐఎస్ నివేదికలతో సరిపోలితే, ఇ-వెరిఫికేషన్ తర్వాత 4 నుంచి 5 వారాల్లో రీఫండ్ జమ అవుతుందని పేర్కొంటున్నారు. ఇక మూలధన లాభాలు, విదేశీ ఆస్తులు, వ్యాపార ఆదాయం ఉన్న రిటర్నుల ప్రాసెసింగ్‌కు మరికొంత సమయం పట్టొచ్చొంటున్నారు. ఐటీఆర్ దాఖలు చేసిన తర్వాత రీఫండ్ ఆలస్యం కావడానికి ప్రధానంగా 5 కారణాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, రీఫండ్ కోసం ఎదురుచూస్తున్న వారు.. ఈ వివరాలను ఒకసారి చూసుకోవడం మంచిది.

**కారణాలివే:**

రీఫండ్‌ను పెంచుకునేందుకు చాలా మంది చేసే ప్రధాన పొరపాటు.. అర్హత లేని మినహాయింపులను క్లెయిం చేయడం అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా నకిలీ ఇంటి అద్దె రశీదులతో భారీ మినహాయింపులు కోరడం, గుర్తింపు లేని ట్రస్టులకు విరాళాలు (సెక్షన్ 80జీ) ఇచ్చినట్లు నకిలీ రశీదులు సృష్టించడం ఐటీ శాఖ ఏఐ వ్యవస్థల దృష్టిని ఆకర్షిస్తాయంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆధారాలు కోరుతూ నోటీసులు రావచ్చని, కాబట్టి, వీటికి ఆధారాలు తప్పనిసరిగా ఉంచుకోవాలంటున్నారు. తప్పుడు ఐటీఆర్‌ను ఎంచుకొని, రిటర్నులు దాఖలు చేసినా.. వాటిని "డిఫెక్టివ్ రిటర్న్"గా పరిగణించే అవకాశం ఉందంటున్నారు. అందుకే, ఏదైనా నోటీసు వస్తే వెంటనే ఐటీ పోర్టల్‌లో "ఇ-ప్రొసీడింగ్స్" ద్వారా గడువులోపు స్పందించాలంటున్నారు. ఐటీఆర్‌లో తప్పులు జరిగాయని గుర్తిస్తే వెంటనే రివైజ్డ్ రిటర్న్ ద్వారా సరిదిద్దుకోవడం ఉత్తమం అని సూచిస్తున్నారు.

# బజాజ్ పల్సర్ ఎన్160 కొత్త అవతార్.. ధరలు, ఫీచర్లు ఇవే

**బజాజ్ కొత్త పల్సర్ ఎన్160ను విడుదల**

**రెండు వేరియంట్ల ధరలు రూ.1.33 లక్షల నుంచి ప్రారంభం**

**165 సీసీ నాలుగు వాల్వుల ఇంజిన్**

**నాలుగు రైడింగ్ మోడ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్**

**క్రాల్ టెక్నాలజీతో సిటీ ట్రాఫిక్ లో ప్రయాణం మరింత సులభం**

**ఐదు అంగుళాల రంగుల స్క్రీన్‌లో గూగుల్ మ్యాప్స్**

**మూడు కొత్త రంగుల్లో అందుబాటులోకి బైక్**



**కబురు న్యూస్, బిజినెస్, ఆగస్టు 8 :**బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్160ను కొత్తగా తీర్చిదిద్దింది. ఈసారి ఎన్160 ఎస్, ఎన్160 ఎస్ఎస్ పేర్లతో రెండు వేరియంట్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. వీటి ఎక్స్‌షోరూమ్ ధరలు వరుసగా రూ.1,33,511, రూ.1,42,585గా ఉన్నాయి.కొత్త పల్సర్‌లో 165 సీసీ నాలుగు వాల్వుల ఇంజిన్‌ను అందించారు. ఇది 18.5 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుందని కంపెనీ తెలిపింది. ఈ విభాగంలోనే అత్యధిక శక్తిని అందించే ఇంజిన్ ఇదేనని పేర్కొంది. 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 4.5 సెకన్లలో అందుకుంటుందని వెల్లడించింది.ఈ బైక్‌లో ఎలక్ట్రానిక్ త్రాటిల్ వ్యవస్థను అమర్చారు. ఇది రైడింగ్‌కు అనుగుణంగా ఇంజిన్ స్పందనను మార్చి మరింత సాఫీగా ప్రయాణించేలా చేస్తుంది.అలాగే రెయిన్, స్పోర్ట్స్, రోడ్, ఆఫ్‌రోడ్ పేర్లతో నాలుగు రైడింగ్ మోడ్‌లను అందించారు. రహదారి పరిస్థితులకు అనుగుణంగా వీటిని ఎంచుకోవచ్చు. తొలిసారిగా ట్రాక్షన్ కంట్రోల్ సదుపాయాన్ని కూడా జోడించారు.ట్రాఫిక్‌లో తరచూ క్లచ్, గేర్లు మార్చాల్సిన అవసరం తగ్గించే క్రాల్ టెక్నాలజీని ఈ బైక్‌లో తీసుకొచ్చారు. అలాగే ఐదు అంగుళాల రంగుల తెరతో పాటు గూగుల్ మ్యాప్స్ సదుపాయాన్ని కల్పించారు. ఈ విభాగంలోని స్పోర్ట్స్ బైక్‌ల్లో ఇది తొలిసారి అని బజాజ్ తెలిపింది.బైక్‌కు కొత్త గ్రాఫిక్స్, రంగు అల్లాయ్ వీల్స్, సవరించిన హ్యాండిల్‌బార్, ఎత్తైన సీటు ఇచ్చారు. అట్లాంటిక్ బ్లూ, పెర్ల్ మెటాలిక్ వైట్, బ్రూక్లిన్ బ్లాక్ రంగుల్లో ఈ బైక్ అందుబాటులో ఉంటుంది.

# డాబర్‌కు హైకోర్టులో భారీ ఊరట

**ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలకు బ్రేక్**

**డాబర్‌కు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట**

**ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధ ఆదేశాలపై ఆగస్టు 24 వరకు స్టే**

**విచారణ అవకాశం ఇవ్వలేదని హైకోర్టు అభిప్రాయం**

**'100 శాతం' క్లెయిమ్‌లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం**

**తమ ప్రకటనలు నిబంధనలకు అనుగుణమేనని డాబర్ వాదన**

**కేంద్రం, ఎఫ్ఎస్ఎస్ఏఐకి నోటీసులు జారీ చేసిన హైకోర్టు**




**కబురు న్యూస్, బిజినెస్, ఆగస్టు 8 :**ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియాకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. '100 శాతం' అంటూ ప్రచారం చేస్తున్న కొన్ని ఉత్పత్తుల విక్రయాలను నిలిపేయాలని ఆహార భద్రత నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఆదేశాలపై కోర్టు శుక్రవారం స్టే విధించింది. తదుపరి విచారణ జరిగే ఆగస్టు 24 వరకు ఈ స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.డాబర్‌కు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా ఇలాంటి నిషేధాజ్ఞలు జారీ చేయడం సరైన విధానం కాదని జస్టిస్ అమిత్ మహాజన్ అభిప్రాయపడ్డారు. ఈ దశలో డాబర్ వాదనల్లో ప్రాథమికంగా బలం కనిపిస్తోందని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, ఎఫ్ఎస్ఎస్ఏఐకి నోటీసులు జారీ చేసి వివరణ కోరారు.తేనె, ఆవు నెయ్యి, వంట నూనెలు, యాపిల్ సైడర్ వెనిగర్, కొబ్బరినీళ్లు తదితర ఉత్పత్తులపై '100 శాతం నేచురల్', '100 శాతం ప్యూర్', '100 శాతం ప్యూరిటీ గ్యారంటీ', '100 శాతం ఆర్గానిక్', '100 శాతం టెండర్ కొబ్బరి నీళ్లు' వంటి ప్రచారాలు నిబంధనలకు విరుద్ధమని ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని పేర్కొంది.డాబర్ హిమాలయన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్, డాబర్ ఆర్గానిక్ హనీపై జైవిక్ భారత్ లోగో వినియోగంపైనా ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం తెలిపింది. అలాగే డాబర్ హోమ్‌మేడ్ కొబ్బరిపాలపై '100 శాతం ప్యూరిటీ' అనే క్లెయిమ్ కూడా అనుమతించదగినది కాదని పేర్కొంది.అయితే ఈ ఉత్పత్తులను దశాబ్దాలుగా విక్రయిస్తున్నామని, షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, తమ వాదనలు వినకుండా నిషేధం విధించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని డాబర్ కోర్టుకు వివరించింది. తమ ఉత్పత్తుల లేబుళ్లు అన్ని చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని, వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఎప్పుడూ చేయలేదని పేర్కొంది.

తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం 09 - 08- 2026




## 'బేబీ' కాంబినేషన్ రిపీట్: ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యల 'ఎపిక్' రిలీజ్ డేట్ ఫిక్స్!

టాలీవుడ్ యువ హీరో ఆనంద్ దేవరకొండ, కథానాయిక వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. 'బేబీ' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ విజయవంతమైన కాంబినేషన్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో సినిమాపై మొదటినుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సాయి సౌజన్య, నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ హిట్ వెబ్ సిరీస్ '90స్ -- ఎ మిడిల్ క్లాస్ బయోపిక్'తో గుర్తింపు పొందిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ ఒక కొత్త పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. అత్యంత అందమైన ప్రయాణాలు చాలా సాధారణ క్షణాలతోనే ప్రారంభమవుతాయి అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కలర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అయితే విజయ్ దేవరకొండ నటించిన రణబాలి సినిమా కూడా సెప్టెంబర్‌లోనే విడుదల కాబోతుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ రెండు సినిమాలు ఒకేసారి విడుదల అయితే అన్నదమ్ములు తొలిసారి బాక్సాఫీస్ వద్ద పోటీపడబోతున్నారు. అయితే రష్మిక మందన్నాకు గాయం కావడంతో రణబాలి వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



## టాలీవుడ్‌లో రితికా నాయక్ హవా..

### 'కొరియన్ కనకరాజు' విజయంతో పెరిగిన క్రేజ్!

టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్ ప్రస్తుతం టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలో చైత్ర అనే మోడరన్ పాత్రలో కనిపించిన రితికా నాయక్ తన అద్భుతమైన అభినయంతో పాటు అందచందాలతో కుర్రకారును ఎంతగానో ఫిదా చేస్తున్నారు. తెరపై ఆమె లుక్స్, పెర్ఫార్మెన్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే కెరీర్ ప్రారంభం నుండి వరుస విజయాలను సొంతం చేసుకుంటూ వస్తున్న ఈ అమ్మడు, టాలీవుడ్‌లో తిరుగులేని 'గోల్డెన్ హ్యాండ్' లేదా 'లక్కీ ఛార్మ్' అనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అశోక వనములో అర్జున కల్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రితికా నాయక్, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్నారు. ఏ పాత్రనైనా తన సహజమైన నటనతో రక్తికట్టించగల నటిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీకి, ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ, కథాబలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రితికా నాయక్ భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు




## హాలీవుడ్ రేంజ్‌లో అల్లు అర్జున్ 'రాకా' ముంబైలోనే ఆ భారీ షెడ్యూల్!

అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'రాకా' షూటింగ్ ప్రస్తుతం ముంబై కేంద్రంగా శరవేగంగా జరుగుతోంది. హాలీవుడ్ రేంజ్ టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ముంబైలోనే కొన్ని ప్రత్యేక సెట్లు వేసి కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి వెకేషన్‌కు వెళ్ళొచ్చిన అల్లు అర్జున్, హైదరాబాద్‌లో అభిమానులను కలిసిన తర్వాత తిరిగి ముంబై సెట్స్‌లో జాయిన్ అయ్యారు.

అయితే అసలు ప్లాన్ ప్రకారం ఈ చిత్రానికి సంబంధించి ఒక ముఖ్యమైన షెడ్యూల్ దుబాయ్‌లో జరగాల్సి ఉంది. కానీ ఇరాన్-యుద్ధం కారణంగా భద్రతా కారణాల రీత్యా దుబాయ్ షెడ్యూల్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. దీంతో దర్శకుడు అట్లీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా, దుబాయ్‌లో జరగాల్సిన షూటింగ్‌ను కూడా ముంబైలోనే భారీ సెట్లు నిర్మించి పూర్తి చేస్తున్నారు. వేర్వేరు లొకేషన్ల చుట్టూ తిరగకుండా, ఒకే ప్రాంతంలో ప్రత్యేక సెట్లు వేసి షూటింగ్‌ను శరవేగంగా ముగిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఆమె తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను దాదాపుగా పూర్తి చేసుకున్నారు. దీపికా ప్రెగ్నెంట్ కావడంతో ఆమెకు సంబంధించిన పార్ట్‌ను అట్లీ ముందుగానే ప్లాన్ చేసి కంప్లీట్ చేశారు. మరోవైపు, ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ బాధ్యతలను ఒక ప్రముఖ హాలీవుడ్ స్టూడియో నిర్వహిస్తోంది. వారి సాంకేతిక అవసరాలకు తగినట్లుగా ముంబైలో ఒక భారీ సౌండ్ స్టేజ్‌ను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ భారీ సెట్లు, హాలీవుడ్ టెక్నీషియన్ల భాగస్వామ్యం, నటుల భారీ రెమ్యునరేషన్ల కారణంగా 'రాకా' బడ్జెట్ ఊహించిన దానికంటే ఎక్కువే అవుతోందని బాలీవుడ్ మీడియా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers,5-11-126/2A, Railway Kaman Track, Sony Function Hall Road, Nizamabad.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com